ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 07.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 288 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



నిప్పులు చెరిగిన సిరాజ్..

8

తెలంగాణ రాజకీయాల్లో కొత్త కదలిక

కవిత నేతృత్వంలో కొత్త పార్టీకి బలపడుతున్న మద్దతు

జాగృతి కార్యాలయానికి భారీగా మద్దతుదారులు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపు కనిపిస్తోంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత త్వరలోనే కొత్త రాజకీయ పార్టీని స్థాపించబోతున్నారన్న ప్రకటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆమె నివాసం, తెలంగాణ జాగృతి కార్యాలయం కేంద్రంగా మారి, రాజకీయంగా కొత్త ఉత్సాహాన్ని నెలకొంది. మంగళవారం నాడు పెద్ద ఎత్తున అభిమానులు, ఉద్యమకారులు, వివిధ సంఘాల నాయకులు కవిత నివాసానికి చేరుకుని ఆమెకు మద్దతు ప్రకటించారు. "తెలంగాణ కోసం కవిత తో నడుస్తాం" అంటూ నినాదాలు చేస్తూ

...:: మిగతా 2లో

ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా ఆమోదం ...:: 2లో



> కాలుష్య కారక పరిశ్రమలు ఓఆర్ఆర్ లోపల ఉండకూడదనే హిల్ట్‌పాలసీ అమలు చేస్తున్నాం. పారదర్శకంగా ముందుకెళ్లేలా హిల్ట్ పాలసీ అమలు చేస్తాం. ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించ వద్దా? 2013లోనే రెడ్ అండ్ ఆరెంజ్ పరిశ్రమలను.. ఓఆర్ఆర్అవతలికి తరలించాలని జీఓ ఇచ్చారు. ప్రజల భవిష్యత్ దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలి. ప్రజలను కాలుష్యం నుంచి రక్షించాలనే మా ఉద్దేశం. హిల్ట్‌పాలసీ బయటకు రాకముందే విమర్శిస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములు అడ్డగోలుగా ఇస్తున్నారని మాట్లాడుతున్నారు.. కనీస సమాచారం తెలియకుండా బీఆర్ఎస్, బీజేపీలు విమర్శలు చేస్తున్నాయి
>
> \- మంత్రి శ్రీధర్‌బాబు

మేల్కొనకపోతే.. మనకూ ఢిల్లీ పరిస్థితి

పారిశ్రామిక ప్రగతి కంటే ప్రజల ప్రాణాలే ముఖ్యం: మంత్రి శ్రీధర్‌బాబు

- తెలంగాణ అసెంబ్లీలో హిల్ట్‌పాలసీపై మంగళవారం చర్చ
- బీఆర్ఎస్ లో జరిగిన అక్రమాలపై కవిత చేసిన వ్యాఖ్యల ప్రస్తావన
- ఎవ్వరిని వదిలే ప్రసక్తే లేదు
- రాజకీయాలను పక్కనపెట్టి ముందుకు రావాలని సూచన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: పారిశ్రామిక ప్రగతి కంటే.. ప్రజల ప్రాణాలే ముఖ్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రాతిపదికన హిల్ట్‌పాలసీ తీసుకువచ్చామన్నారు. మంగళవారం అసెంబ్లీలో హిల్ట్‌పాలసీపై లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఈ హిల్ట్‌పాలసీ విషయంలో రాజకీయాలు పక్కన పెట్టాలంటూ ప్రతిపక్షాలకు సూచించారు. హిల్ట్‌పాలసీలో ఏదో మతలబ్ ఉందని ఆరోపణలు చేశారని తెలిపారు. కొండను తవ్వుతూనే ఉన్నారని.. ఎంత తవ్వుతారో తాము చూస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కావాలనే ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారంటూ ప్రతిపక్షాలపై మండిపడ్డారు. స్వచ్ఛమైన గాలి, నీరు ఇవ్వలేని నాగరికత.. అసమర్థ నాగరికతే అవుతుందని అభివర్ణించారు. అభివృద్ధి పేరిట పర్యావరణ విధ్వంసం జరుగుతోందని ఆయన హెచ్చరించారు. అభివృద్ధి అంటే ప్రకృతిని నాశనం చేయడం కాదన్నారు. పిల్లలకు ఆస్తులు కాదు.. శుభ్రమైన వాతావరణం ఇవ్వడమే నిజమైన వారసత్వమని ఈ సందర్భంగా మంత్రి డి.శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. ఇంకా చెప్పాలంటే బంగారు గిన్నెలో విషం పెట్టినట్లవుతోంది మన పరిస్థితంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి నాశనమైతే తిరిగి రాదని మంత్రి హెచ్చరించారు. మనమంతా భూమి యజమానులు కాదని.. కేవలం ట్రస్టీలమేనన్నారు. భవిష్యత్తు తరాలకు క్లీన్ ఎన్వీరాన్మెంట్ ఇవ్వడం మన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నివాసాల మధ్యనున్న 168 పరిశ్రమలను..

...:: మిగతా 2లో



ఢిల్లీ కాలుష్యానికి కారణాలు గుర్తించండి

ఢిల్లీలో పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వాయు కాలుష్యాన్ని నియంత్రించాలంటే ముందు . కాలుష్యానికి గల కారణాలు గుర్తించాలని సూచించింది. కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కు ఆదేశాలు జారీ చేసింది.

7



సోనియా గాంధీకి అస్వస్థత

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో సోమవారం రాత్రి ఢిల్లీలోని గంగారామ్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు.

7

ఈవీలపై 20 శాతం డిస్కౌంట్



- కలెక్టరేట్లు, టూరిజం స్పాట్లలో ఈవీ చార్జింగ్ స్టేషన్లు
- ఈవీ వాహనాల కొనుగోలుకు చర్యలు..
- ప్రభుత్వ ఉద్యోగులకు ప్రోత్సాహకం
- సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం వివరణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 6: భవిష్యత్ తరానికి మంచి జీవితాన్ని అందించడమే లక్ష్యంగా జీవో 41 ద్వారా ఈవీ పాలసీని తీసుకువచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, టూరిజం స్పాట్లలో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నామని మంత్రి తెలిపారు. ఈవీలు కొనుగోలు చేసే ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం డిస్కౌంట్ లభించేలా అమ్మకందారులతో మాట్లాడుతున్నామన్నారు. మంగళవారం నాడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈవీ పాలసీ, ఆర్టీసీకి సంబంధించిన అంశాలపై చర్చ జరిగింది. దీనిపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం ఇచ్చారు. గడిచిన సంవత్సర కాలంలో లక్ష ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుపోయాయని మంత్రి తెలిపారు. ఈవీలు గతంలో ఒకసారి ఛార్జింగ్ చేస్తే 150 కిలోమీటర్ల రేంజ్ వచ్చేదని.. ఇప్పుడు 500 కిలోమీటర్లు ప్రయాణించే కెపాసిటీ వాహనాలు వచ్చాయని వివరించారు. ఈ కెపాసిటీని మరింత పెంచడానికి సమీక్షలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. అలాగే ఛార్జింగ్ స్టేషన్‌లను

...:: మిగతా 2లో

మార్చి నాటికి భూభారతి కొత్త పోర్టల్


- ఒకే గొడుగు కిందకు రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్
- వారం రోజుల్లో మరో 3వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 6 : రెవెన్యూ, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ విభాగాలను భూభారతి పోర్టల్‌లో ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నామని ఈ పోర్టల్‌ను మార్చి నాటికి పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు, పారదర్శకంగా ఉండేలా ఈ పోర్టల్‌ను

...:: మిగతా 2లో



కాగ్రెస్ నేత సురేశ్‌కల్మాడీ కన్నుమూత

కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సురేశ్ కల్మాడీ(81) కన్నుమూశారు. పుణెలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 3.30గంటలకు చనిపోయారు.

7



- తెలంగాణను మోసం చేసిన రాహుల్ గాంధీని నడిబజార్లో ఉరితీయాలి
- మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసిన హౌళగాళ్లు రాహుల్,
- నదులపై, తెలంగాణపై కనీస అవగాహన లేని రేవంత్ రెడ్డి
- రేవంత్ రెడ్డి కేసీఆర్ కాలి చెప్పు ధూళితో సమానం
- కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్‌కే రేవంత్ ఆగమాగం
- జనగామ సభలో కేటీఆర్ నిప్పులు

మూటలు మోయడం తప్ప రేవంత్ రెడ్డికి ఏం తెల్వదు

ప్రతిపక్షం ప్రతినిధి, జనగామ

జనవరి 6: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జనగామ పట్టణంలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభ ఘనంగా నిర్వహించారు. జనగామ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరపున విజయం సాధించిన సర్పంచులను సన్మానించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రిగా ఏమీ తెలియదని, ఆయనకు కేవలం మూటలు మోయడం తప్ప వేరే ఏమీ రాదని ఎద్దేవా చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన రాహుల్ గాంధీని, నిరుద్యోగులను నమ్మించి వంచించినందుకు నడిబజార్లో ఉరితీయాలని ఘాటుగా విమర్శించారు. మరోసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన కేటీఆర్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రికి ఏం తెలవదు.. మూటలు మోసుడు తప్ప ఇంకేమీ తెలవదని ఘాటుగా వ్యాఖ్యానించారు. తెలంగాణను 60 సంవత్సరాల పాటు రాచిరంపాన పెట్టిన కాంగ్రెస్ పార్టీ అనే విషయం మర్చిపోయి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. 60 సంవత్సరాల కాంగ్రెస్ దుర్మార్గాన్ని, తెలంగాణకు చేసిన ద్రోహాన్ని తన దీక్షతో ప్రాణాలకు తెగించి కొట్లాడి తెలంగాణ సాధించిన కేసీఆర్ పైన అడ్డగోలుగా మాట్లాడుతున్నారని

...:: మిగతా 2లో

ఈ సారి బడ్జెట్ ఆదివారం?

ఫిబ్రవరి 1 ఆదివారం కావడంతో దేశ వ్యాప్తంగా చర్చ



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 6: కేంద్ర ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ బడ్జెట్ పై మధ్యతరగతి ప్రజలు, రైతులు, యువత.. ఇలా ప్రతీ ఒక్కరూ కోటి ఆశలు పెట్టుకున్నారు. అదే సమయంలో నిర్మలమ్మ ప్రవేశపెట్టే ఈ బడ్జెట్ గురించి ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్రంగా చర్చ నడుస్తోంది. ఏటా బడ్జెట్‌ను ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. 2017 నుంచి ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. అయితే, ఈ సారి ఫిబ్రవరి 1వ తేదీన ఆదివారం పడింది. దీంతో ఆ రోజు సెలవు కావడంతో బడ్జెట్ ప్రవేశ పెడతారా..? లేదా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం బడ్జెట్‌ను ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టొచ్చన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ అంశం ఆసక్తికరంగా మారింది. అయితే, దీనిపై కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

ఆదివారం కూడా పార్లమెంట్..

అయితే, వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్తేమీ కాదు. 2016 తొలిసారి అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వార్షిక బడ్జెట్‌ను ఆదివారమే ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 2025లో బడ్జెట్‌ను నిర్మలమ్మ శనివారం ప్రవేశపెట్టారు. గతంలో

...:: మిగతా 2లో



నేపాల్‌లో మత ఘర్షణలు.. బార్డర్ మూసివేత

భారత సరిహద్దు దేశమైన నేపాల్ లో మత ఘర్షణలు చెలరేగుతున్నాయి. దీంతో ఆ ఘర్షణ ప్రభావం ఇండియాపై పడకుండా భారత ప్రభుత్వం ఇరు దేశాల సరిహద్దును మూసివేసింది.

7

రాజకీయం

తెలంగాణ రాజకీయాల్లో కొత్త కదలిక

మొదటిపేజీ తరువాయి

సంఘీభావం తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పోరాటం చేసిన అనేక మంది నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషంగా నిలిచింది. ఉద్యమకారుల జేఏసీ సంపూర్ణ మద్దతు తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ స్టేట్ కమిటీ ప్రతినిధులు కవితను కలిసి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేతలు మాట్లాడుతూ, "ఉద్యమ ఆశయాలు నెరవేర్చే నాయకత్వం అవసరం. కవిత నాయకత్వంపై మాకు నమ్మకం ఉంది" అని పేర్కొన్నారు. వివిధ ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాల మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు భారీగా తరలివచ్చారు. సామాజిక న్యాయం, సమానత్వం, యువత భవిష్యత్ కోసం కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ప్రత్యేకంగా విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, "యువత ఆకాంక్షలను అర్థం చేసుకునే నాయకురాలిగా కవిత ముందుకు రావడం ఆనందంగా ఉంది" అన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, "తెలంగాణ ప్రజల ఆశయాలు, ఉద్యమ ఆత్మ సజీవంగా ఉండాలి. ప్రజల కోసం, తెలంగాణ భవిష్యత్ కోసం కొత్త రాజకీయ ప్రయాణానికి సిద్ధమవుతున్నాం. నాకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు.

రాజకీయ వర్గాల్లో ఆసక్తి

కవిత కొత్త పార్టీ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. ముఖ్యంగా ఉద్యమకారులు, యువత, వివిధ సామాజిక వర్గాల నుంచి వస్తున్న మద్దతు ఈ పార్టీ భవిష్యత్తుపై ఆసక్తిని పెంచుతోంది. బంజారాహిల్స్‌లో జరిగిన ఈ సంఘీభావ కార్యక్రమం, రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా ఆమోదం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 6: నిజామాబాద్ స్థానిక సంస్థల శాసన మండలి సభ్యత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన రాజీనామాను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదించారు. ఈ మేరకు ఆమె రాజీనామా ఆమోదంపై లెజిస్లేటివ్ సెక్రటరీ అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. కల్వకుంట్ల కవిత 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి శాసన మండలి సభ్యురాలిగా ఎన్నికయ్యారు. అనంతరం సెప్టెంబర్ 3న బీఆర్ఎస్ పార్టీతో పాటు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా సోమవారం శాసన మండలిలో ప్రసంగించిన కవిత, తాను సమర్పించిన రాజీనామాను ఆమోదించాలని సభను కోరారు. దానికి అనుగుణంగా ఇప్పుడు అధికారికంగా ఆమె రాజీనామాకు ఆమోదం లభించింది.

ఈవీలపై 20 శాతం డిస్కౌంట్

మొదటిపేజీ తరువాయి

పెంచడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు . ఇటీవల ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారులు, డీలర్లతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఈవీలు గణనీయంగా పెరిగాయన్నారు. రెడ్కో సంస్థల ద్వారా ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఈవీ వాహనాలు కొనేలా విధానం...

రాష్ట్రప్రభుత్వానికి సంబంధించిన వాహనాలు, పాఠశాల బస్సులు, ఫార్మా, ఐటీ వాహనాలు 25, 50 శాతం వారి అవసరాలు బట్టి ఎలక్ట్రిక్ వెహికల్స్ కొనేలా విధానం తీసుకురాబోతున్నామని మంత్రి పొన్నం తెలిపారు. ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ చూస్తే అక్కడ గాలిలో ప్రమాదకరమైన బ్యాక్టరీయా ఉన్నట్లు తెలుస్తుందన్న మంత్రి.. హైదరాబాద్‌లో డిల్లీ లాంటి ప్రమాదకర పరిస్థితి రాకుండా ఉండడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈవీ పాలసీ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలు, సీఎన్‌జీ, ఎల్పీజీ వాహనాల వినియోగం పెంచుతున్నామన్నారు. పీఎం ఈ డ్రైవ్ కింద 2,800 బస్సులు దశల వారీగా వస్తున్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు.

కలెక్టరేట్లు, టూరిజం స్పాట్లలో ఈవీ చార్జింగ్ స్టేషన్లు.

వరంగల్ మున్సిపాలిటీకి 100, నిజామాబాద్ మున్సిపాలిటీ 50 ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని మంత్రి పొన్నం ప్రకటించారు. అన్ని కలెక్టరేట్లలో, రెస్టారెంట్లలో, టూరిజం స్పాట్లలో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ బాగుండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. హైదరాబాద్‌లో 200 ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ దాటుతుందని.. ఢిల్లీలో 400 దాటిందన్నారు. కాలుష్య నివారణకు ప్లాంటేషన్ పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే ఈవీల వినియోగం పెంచాలని.. దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. రాబోయే తరానికి కాలుష్య రహిత తెలంగాణ అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

మార్చి నాటికి భూభారతి కొత్త పోర్టల్

మొదటిపేజీ తరువాయి

రూపొందించామని వెల్లడించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, దేవాదాయ, అటవీ, వక్ఫ్ భూములు తదితర అన్ని వివరాలు కనిపించేలా పోర్టల్‌లో పొందుపరిచామని తెలిపారు. మంగళవారం నాడు నాంపల్లిలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెస్సా) 2026 డైరీని మంత్రిగారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వ పదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థలో ఎదుర్కొన్న సమస్యల నుంచి విముక్తి లభిస్తుందనే నమ్మకంతో తెలంగాణ ప్రజానీకం ఇందిరమ్మ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పదేళ్ల కాలంలో భ్రష్టు పట్టిన రెవెన్యూ వ్యవస్థను ఒక్కో మెట్టు పేర్చుకుంటూ గ్రామ స్థాయి వరకు బలోపేతం చేశామని ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని అయితే ఇవి సరిపోవని ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని మంత్రి గారు అన్నారు. రాష్ట్రంలో దశాబ్దాలుగా సాగుతున్న భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా గడచిన రెండేళ్లలో ఎన్నో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి పోర్టల్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ రైతుల భూములకు సంబంధించి గుండెకాయలాంటి సర్వే విభాగాన్ని పటిష్టపరుస్తున్నామని ఇందులో భాగంగా ఇప్పటికే 3500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం జరిగిందని వారం రోజుల్లో మరో మూడువేల మందిని తీసుకోబోతున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు తమ ప్రభుత్వం అర్థం చేసుకుందని, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందుల వల్లే కొంత ఆలస్యం జరుగుతుందని ప్రభుత్వం తరపున ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన అన్ని ప్రయోజనాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రెస్సా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగా రవీందర్ రెడ్డి, గౌతమ్ కుమార్, కోశాధికారి రమణారెడ్డి, కల్చరల్ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, టిఎన్‌జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాస్, జగదీష్, ఆర్డీవో ఉపేందర్ రెడ్డి జిహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఈ సారి బడ్జెట్ ఆదివారం?

మొదటిపేజీ తరువాయి

ఆదివారాల్లో పార్లమెంట్ సమావేశమైన సందర్భాలు కూడా ఉన్నాయి. కరోనా సమయంలో (2020), అలాగే పార్లమెంట్ తొలి సమావేశం 60వ వార్షికోత్సవం సందర్భంగా 2012, మే13వ తేదీన ఆదివారం నాడు సభ జరిగింది. ఈ లెక్కన పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం నాడు కూడా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం లేకపోలేదు.

ఫిబ్రవరి 1నే ఎందుకు..?

పలు నివేదికల ప్రకారం.. గతంలో కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి రోజున సమర్పించేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద ప్రక్రియ ఆలస్యమయ్యేది. దీంతో కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి ప్రభుత్వ ఖర్చుల కోసం భారత కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులను ఉపసంహరించుకునేందుకు వీలుగా పార్లమెంట్ 'ఓట్ ఆన్ అకౌంట్'ను ఆమోదించాల్సి వచ్చేది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు శాఖాపరమైన డిమాండ్లను వివరంగా పరిశీలించిన తర్వాత, మిగిలిన సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ఆమెదించేవారు. ఇది తీవ్ర జాప్యాలకు దారితీస్తుండటంతో.. దీన్ని నివారించేందుకు 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే అంటే మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తుంది.



బీజేపీ ఐటీ సెల్ డెవలప్ చేసిన మొబైల్ అప్లికేషన్లను పశ్చిమ బెంగాల్‌లో ఎలక్టోరల్ రోల్ సవరణకు ఎన్నికల సంఘం ఉపయోగిస్తోంది. ఇది చట్ట విరుద్ధం. ఎస్ఐఆర్ నిర్వహణలో అన్ని తప్పుడు చర్యలను ఈసీ అవలంబిస్తోంది. అర్హులైన ఓటర్లను చనిపోయినట్లు చూపుతోంది. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని విచారణకు పిలుస్తోంది. ఇది అన్యాయం. అప్రజాస్వామికం

- మమతా బెనర్జీ,
పశ్చిమ బెంగాల్ సీఎం.

మేల్కొనకపోతే.. మనకూ ఢిల్లీ పరిస్థితి

మొదటిపేజీ తరువాయి

తరలించాలని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. చైనాలో బ్లూ స్కై విధానం ద్వారా.. భారీ పరిశ్రమలను నగరం అవతలికి తరలించారని వివరించారు. కాలుష్య కారక పరిశ్రమలు ఓఆర్ఆర్ లోపల ఉండకూడదనే హిల్ట్ పాలసీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. పారదర్శకంగా ముందుకెళ్లేలా హిల్ట్ పాలసీ అమలు చేస్తామన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించ వద్దా? అంటూ ప్రతిపక్షాలను మంత్రి శ్రీధర్‌బాబు సూటిగా ప్రశ్నించారు. 2013లోనే రెడ్ అండ్ ఆరెంజ్ పరిశ్రమలను.. ఓఆర్ ఆర్ అవతలికి తరలించాలని జీఓ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజల భవిష్యత్ దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలన్నారు. ప్రజలను కాలుష్యం నుంచి రక్షించాలనే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. హిల్ట్‌పాలసీ బయటకు రాకముందే విమర్శిస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములు అడ్డగోలుగా ఇస్తున్నారని మాట్లాడుతున్నారని.. అయితే కనీస సమాచారం తెలియకుండా బీఆర్ఎస్, బీజేపీలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ హిల్ట్‌పాలసీపై సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తామన్నారు. ఈ పాలసీపై కింద 6 నెలల గడువు ఇస్తామని పేర్కొన్నారు. స్వచ్ఛందంగా ముందు కొస్తేనే భూములు కన్వర్ట్ చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తల భూములు.. ప్రభుత్వానివి అంటూ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దశాబ్దాల కిందటే గత ప్రభుత్వాలు వారికి భూములు అమ్మేశాయని గుర్తు చేశారు. మనం భూ యజమానులం కాదని.. ట్రస్టీలం మాత్రమేనని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ల్యాండ్ కన్వర్షన్‌పై బలవంతం ఏమీలేదన్నారు. పారిశ్రామికవేత్తలకు ఇష్టమైతేనే ల్యాండ్ కన్వర్షన్ చేస్తామని తెలిపారు. గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయంటూ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ఇప్పటికైనా పర్యావరణ విధ్వంసం ఆగాలన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు అపార్ట్‌మెంట్స్ పక్కనే ఉన్నాయని.. పరిశ్రమలు, రెసిడెన్షియల్ ప్రాంతాల మధ్య బఫర్‌జోన్లు లేవన్నారు. బఫర్ జోన్లు లేకపోవడం వల్లే.. గతంలో విశాఖపట్నంలో ఎల్జీ పాలిమర్స్, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో గ్యాస్ వంటి దుర్ఘటనలు చోటు చేసుకున్నాయని వివరించారు. పారిశ్రామిక రసాయనాల వల్లే భూగర్భ జలాలు విషపూరితం అవుతాయని తెలిపారు. ఇప్పటికైనా మేల్కోకపోతే హైదరాబాద్ కూడా.. ఢిల్లీ పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందంటూ మంత్రి శ్రీధర్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు.

ఎవ్వరిని వదిలే ప్రసక్తే లేదు..

ప్రకృతి ఒకసారి నాశనమైతే తిరిగి తీసుకురాలేమని అందువల్ల రేపటి తరాల భవిష్యత్, నేల మనుగడ కోసం హిల్ట్ పాలసీ తీసుకువస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించడం మన బాధ్యత అని చెప్పారు. ఇవాళ హిల్ట్ పాలసీపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా మాట్లాడిన ఆయన.. హిల్ట్ పాలసీని సాదాసీదా భూమార్పిడిగా చూస్తున్నారని కానీ ఈ పాలసీ ద్వారా పారిశ్రామిక ప్రాంతం నివాస ప్రాంతంగా మారుతోందన్నారు. హిల్ట్ పాలసీ విషయంలో సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తామన్నారు. మాపై బురద చల్లాలని, విమర్శలు చేసేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. రేపటి భాగ్య నగరం కోసం రాజకీయాలు పక్కన పెట్టాలని పిలుపునిచ్చారు.

బేసిక్స్ తెలియకుండానే బీఆర్ఎస్, బీజేపీ విమర్శలు:

హిల్ట్ పాలసీ బయటకు రాకముందే విమర్శలు చేస్తున్నారని, బేసిక్ సమాచారం తెలియకుండా బీఆర్ఎస్, బీజేపీ విమర్శలు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ భూములు అడ్డగోలుగా ఇస్తున్నారని మాట్లాడుతున్నారు. కానీ దశాబ్దాల కిందటే గత ప్రభుత్వాలు వారికి భూములు అమ్మేశాయి. పారిశ్రామిక వేత్తల భూములు ప్రభుత్వ భూములని ప్రచారం చేస్తున్నారన్నారు. హిల్ట్ పాలసీ కింద ఆరు నెలల గడువు ఇస్తాం. స్వచ్ఛందంగా ముందుకొస్తేనే భూములు కన్వర్ట్ చేస్తామన్నారు. పారదర్శకంగా ముందుకెళ్లేలా పాలసీ తీసుకొచ్చామని 2013లోనే రెడ్ అండ్ ఆరెంజ్ ఇండస్ట్రీస్ ఔటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలించాలని జీవో ఇచ్చారన్నారు. గతపాలకులు కూడా కేబినెట్ సబ్ కమిటీ వేశారని గతంలో భూములు కన్వర్ట్ చేస్తుంటే బీజేపీ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఇండస్ట్రియల్ పార్కులకు బీఆర్ఎస్ నేతలు వెళ్లినా వారిని ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. ల్యాండ్ కన్వర్షన్కు ఫీజు తగ్గించాలని పారిశ్రామిక వేత్తలు మమ్మల్ని కోరుతున్నారని చెప్పారు. హైదరాబాద్ గ్రిడ్ పాలసీ అని 2020లో తీసుకొచ్చాం. గ్రిడ్ పాలసీ కింద 11 ఇండస్ట్రియల్ ప్రాంతాలను ఐటీ కారిడార్లుగా మార్చాలని ప్రయత్నించారు. కానీ నాడు ఎవ్వరూ ముందుకు రాలేదు. లీజు ల్యాండ్ ను ఫ్రీ హోల్డ్ చేసిన గత పాలకులు మమ్మల్ని ప్రశ్నిస్తారా? అని నిలదీశారు. గత ప్రభుత్వంలో ఏం జరిగిందో కవిత నిన్ననే సభలో మాట్లాడారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ భూవినియోగ మార్పిడి విషయంలో ఏ రకమైన విచారణ జరిపించాలో సీఎం నిర్ణయం తీసుకుంటారన్నారు. ఈ అక్రమాల విషయంలో ఎవ్వరిని వదిలే ప్రసక్తే లేదన్నారు.

ఇప్పటికీ మేల్కోకపోతే కష్టమే:

ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలివైపు తరలిస్తాని చెప్పారు. జీడిమెట్ల, ఉప్పల్, సనత్ నగర్, చర్లపల్లి, ప్రాంతాలు ఇండస్ట్రియల్ జోన్లుగా ఉండేవి. ఒక్కప్పుడు ఈ ప్రాంతాలు జనావాసాలకు దూరంగా ఉండేవి. కానీ ఈ 50 ఏళ్లలో హైదరాబాద్ మహానగరంగా విస్తరించింది. ఒకప్పుడు నగర శివారు ప్రాంతాలు ప్రస్తుతం రెసిడెన్షియల్ కాలనీస్ గా మారాయి. నాడు ఫ్యాక్టరీకి ఇంటికి మధ్య కిలో మీటర్ దూరం ఉంటే ఇప్పుడు ఫ్యాక్టరీ గోడకు ఆనుకునే ఇంటి గోడ ఉంటోంది. పరిశ్రమల నుంచి వచ్చే పొగను ప్రత్యక్షంగా పీలుస్తున్నారు. పరిశ్రమలు, రెసిడెన్షియల్ ప్రాంతాలకు మధ్య బఫర్ జోన్లు లేకుండా పోయాయన్నారు. బఫర్ జోన్లు లేకపోవడం వల్లే ఎల్జీ పాలిమర్స్, భోపాల్ గ్యాస్ దుర్ఘటనలు జరిగాయన్నారు. నగరంలోని భూగర్భ జలాల్లో విషపూరిత పదార్థాలు ఉన్నాయని, పారిశ్రామిక రసాయనాల వల్లే భూగర్భజలాల్లో విషపూరిత పదార్థాలు చేరాయన్నారు. ఇప్పటికీ మేల్కోకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రతి ఇంటికీ ఒక ఆసుపత్రి ఉంటుందని అందువల్ల హిల్ట్ పాలసీ విషయంలో సభ్యులు రాజకీయాలు పక్కన పెట్టాలన్నారు.

ఆత్మవిమర్శ చేసుకోండి:

చైనాలో బ్లూ స్కై పాలసీ ద్వారా భారీ పరిశ్రమలను నగరం అవతలి వైపునకు తరలించారని, పారిశ్రామిక ప్రగతి కంటే ప్రజల ప్రాణాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు సైతం చెప్పిందని గుర్తు చేశారు. ఢిల్లీలోని నివాసాల మధ్య ఉన్న 168 పరిశ్రమలను తరలించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని సుప్రీంకోర్టు తీర్పు ప్రాతిపదికన హిల్ట్ పాలసీ తీసుకొచ్చామన్నారు. పూర్వీకులు స్వచ్ఛమైన ప్రకృతిని వారసత్వంగా అందించారు. రేపటి తరానికి స్వచ్ఛమైన ప్రకృతిని అందజేస్తున్నామా లేదా అని ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. మనం వారసత్వంగా ఇచ్చిన సంపద వారి ప్రాణాలను కాపాడుతుందా అని ప్రశ్నించారు.

తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి

- గ్రామాల్లో సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి
- పంపుసెట్లకు వెంటనే మరమ్మత్తులు చేయాలి
- స్వలాభం కోసం అవసరం లేకపోయినా బోర్లు వేసేందుకు ప్రొత్సహిస్తున్నారంటూ అసంతృప్తి
- అలాంటి ఇంజనీర్లపై చర్యలు తప్పవంటూ హెచ్చరిక
- మిషన్ భగీరథ తాగునీటి సరఫరా సమీక్షలో మంత్రి సీతక్క



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 6: గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. "ముందుచూపుతో ప్రణాళికలు రూపొందించాలి. సమస్య తలెత్తిన తర్వాత స్పందించడం కాదు, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యం" అని సీతక్క అన్నారు. ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో గ్రామీణ తాగునీటి సరఫరాపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క మంగళవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, సీఈలు, ఎస్ఈలు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పంపుసెట్లు పాడైన చోట్ల వెంటనే మరమ్మతులు చేపట్టాలని, చిన్న లోపాల వల్ల పెద్ద సమస్యలు తలెత్తకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా వేసవిలో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గత ఏడాది పకడ్బందీ ప్రణాళికలతో రాష్ట్రంలో తాగునీటి సమస్యలు రాకుండా నియంత్రించగలిగామని మంత్రి గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా రిజర్వాయర్లలో తగినంత నీటి లభ్యత ఉందని, అయితే ఎప్పటికప్పుడు నీటి నిల్వలను అంచనా వేస్తూ, పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అదే సమయంలో, కొన్ని చోట్ల మిషన్ భగీరథ సిబ్బంది స్వలాభం కోసం అవసరం లేకపోయినా కొత్త బోర్లు వేయాలని ప్రోత్సహిస్తున్నారని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. "అవసరం లేని కొత్త బోర్ల వల్ల డబ్బు, శ్రమ రెండూ వృథా అవుతున్నాయి. దీనిపై కఠినంగా చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. మేడారం మహా జాతర దృష్ట్యా తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. జాతర సందర్భంగా ఎలాంటి నీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులను ప్రత్యేకంగా నియమిస్తామని చెప్పారు. ఈ నెల 10వ తేదీన మేడారంలో మిషన్ భగీరథ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని వెల్లడించారు. జాతర కాలంలో నిరంతరం అంతరాయం లేకుండా తాగునీరు సరఫరా అయ్యేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండటం ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. మేడారం మహా జాతరకు ఆహ్వానిస్తూ మిషన్ భగీరథ సిబ్బంది తరుపున ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్ రెడ్డికి మంత్రి సీతక్క ఆహ్వానం పత్రిక ఇచ్చారు.

మూటలు మోయడం తప్ప రేవంత్ రెడ్డికి ఏం తెల్వదు

మొదటిపేజీ తరువాయి

విమర్శించారు. కేసీఆర్‌ను ఉరివేయాలి అంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మరోసారి ప్రస్తావించిన కేటీఆర్, రేవంత్ రెడ్డి భాషలోనే మరోసారి సమాధానం ఇచ్చారు. ఇంటింటికి నీళ్లు ఇచ్చినందుకు, అమ్మలక్కలకు ఆసరా పెన్షన్లు ఇచ్చినందుకు, ముసలివారికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పెన్షన్‌ను 10రెట్లు పెంచినందుకు, రైతన్నలకు రైతుబంధు ఇచ్చినందుకు, రైతు భీమా ఇచ్చినందుకు, సాగునీటి ప్రాజెక్టులు కట్టి దేశంలోనే పంటల ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిపినందుకు, తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినందుకు కేసీఆర్‌కు ఉరివేయాలని రేవంత్ రెడ్డి అంటున్నాడా అని కేటీఆర్ ప్రశ్నించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అడ్డగోలుగా హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను రాహుల్ గాంధీ మోసం చేశాడని ఆరోపించారు. మరి రాహుల్ గాంధీ అనే హౌలా గాడిని నడిబజార్లో ఉరితీయాలని వ్యాఖ్యానించారు. మొదటి సంవత్సరమే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన రాహుల్ గాంధీ అనే హౌలా గాడి మాటలు విని ప్రతి ఒక్క నిరుద్యోగి విద్యార్థులు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయించారని అన్నారు. చదువుకున్న విద్యార్థులను, నిరుద్యోగులను మోసగారి మాటలతో రెచ్చగొట్టిన రాహుల్ గాంధీ అనే హౌలాగాడిని ఉరితీయాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నదులపై, తెలంగాణపై కనీస అవగాహన లేని రేవంత్ రెడ్డి అని విమర్శించారు. కేసీఆర్‌కు నీళ్ల గురించి రేవంత్ రెడ్డి పాఠాలు చెప్తున్నాడని ఎద్దేవా చేశారు. గోదావరి ఎక్కడుందో రేవంత్‌కు తెలియదని, భాక్రా నంగల్ ప్రాజెక్టు తెలంగాణలో ఉందని చెప్తున్నాడని వ్యాఖ్యానించారు. తెలంగాణను 60 ఏళ్ల పాటు రాచిరంపాన పెట్టిన కాంగ్రెస్ చరిత్రను మర్చిపోయి రేవంత్ మాట్లాడుతున్నారని, ప్రాణాలకు తెగించి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ పై అడ్డగోలుగా మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. కేసీఆర్‌ను ఉరితీయాలన్న రేవంత్ వ్యాఖ్యలకు కేటీఆర్ తనదైన శైలిలో సమాధానమిస్తూ.. ఇంటింటికీ నీళ్లు ఇచ్చినందుకు, పెన్షన్లు పదింతలు పెంచినందుకు, రైతుబంధు, రైతుబీమా ఇచ్చి వ్యవసాయంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపినందుకు కేసీఆర్‌ను ఉరితీయాలా అని ప్రశ్నించారు. రైతుబంధు ₹15,000 ఇస్తామని, కౌలుదారులను ఆదుకుంటామని, క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పూర్తిగా మోసం చేసిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు ఇచ్చే ముఖం లేని రేవంత్ రెడ్డి, నెలకు ₹2,500 ఇవ్వలేక పోతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాననడం హాస్యాస్పదమని, నేడు ఆడబిడ్డలు పుస్తెల తాడు తాకట్టు పెట్టే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస అవగాహన లేని రేవంత్ రెడ్డికి నదుల గురించి, ప్రాజెక్టుల గురించి ఏమీ తెలియదని, గోదావరి ఎక్కడ ఉందో తెలియక భాక్రా నంగల్ ప్రాజెక్టు తెలంగాణలో ఉందని పిచ్చిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి తన సొంత సెక్యూరిటీ సిబ్బందిని కొడుతున్నారని, ఆయన పిచ్చి ముదిరి త్వరలోనే ప్రజలను కరిచే ప్రమాదం ఉంది కాబట్టి కట్టేయమని ఆయన భార్య గీతకు చెప్పామన్నారు. జనగామ పట్టణంలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభ ఘనంగా నిర్వహించారు. జనగామ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరపున విజయం సాధించిన సర్పంచులను సన్మానించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, తాటికొండ రాజయ్య, నన్నపనేని నరేందర్ మరియు బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరైన ఈ వేదికపై కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు, ఒత్తిళ్లకు గురిచేసినా పార్టీ కోసం నిలబడి గెలిచిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి ధన్యవాదాలు తెలిపారు. వరంగల్, జనగామ ప్రాంతాల్లో సర్పంచులు పెద్ద సంఖ్యలో గెలుపొందడం హర్షణీయమని, జనగామ ర్యాలీ చూస్తుంటే కేసీఆర్ గారు మరోసారి ముఖ్యమంత్రి అయ్యారనిపించిందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలు గులాబీ జెండాను చూసి కొడుతున్న చప్పట్లు చూస్తుంటే సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా తనకు కాళోజీ మాటలు గుర్తొస్తున్నాయని భావోద్వేగంగా మాట్లాడారు. కేసీఆర్ ఎప్పుడు మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారా అని ప్రజలు కసితో ఎదురుచూస్తున్నారని ఆయన తెలిపారు. ఇదే క్రమంలో కడియం శ్రీహరిపై విమర్శలు చేస్తూ.. తెలంగాణ ఉద్యమంలో ఏ పాత్ర లేకపోయినా అన్ని పదవులు ఇచ్చిన పార్టీని వదిలి ఆయన రేవంత్ రెడ్డితో కలిశారని మండిపడ్డారు. తమకు నిబద్ధత కలిగిన కార్యకర్తలు ఉన్నారని, వారి కృషితోనే 150 మంది సర్పంచులు గెలిచారని కొనియాడారు. చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, రాణి రుద్రమదేవి వంటి వీరులు పుట్టిన ఈ గడ్డపై బీఆర్ఎస్ జెండా రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు గెలిచిన ప్రతి ఒక్క సర్పంచి రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే పట్టుదలతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. కారు గుర్తు కనిపిస్తే కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలన్న బలమైన ఆలోచనతోనే ప్రజలు ఓటు వేసి గెలిపించుకున్నారని, భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుదామని కేటీఆర్ స్పష్టం చేశారు.

రాష్ట్రీయం

సామాజిక తెలంగాణ కోసం కలిసి నడుద్దాం

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఉద్యమకారులు, ఉద్యోగులు, ప్రజా, కుల సంఘాలు, యూనివర్సిటీ విద్యార్థులు, వివిధ సంఘాల మద్దతు
- మద్దతుదారులతో కిక్కిరిసిన జాగృతి కార్యాలయం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 6: సామాజిక తెలంగాణ సాధన కోసం కలిసి నడుద్దామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తెలంగాణ అస్తిత్వం కోసం పనిచేసే పార్టీ అవసరం ఉందని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కుల సంఘాలు, వివిధ యూనివర్సిటీల విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవితను కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కవితకు సంఘీభావం తెలిపేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జాగృతి కార్యకర్తలు, అభిమానులు, వివిధ ప్రజా సంఘాలు, విద్యార్థి, కుల సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు, సింగరేణి కార్మికులు, ఉద్యమకారులు తరలివచ్చారు. దీంతో హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయం కిక్కిరిసిపోయింది. జాగృతి కార్యకర్తలు, అభిమానులు "జై కవితక్క" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా వారందరికీ అభివాదం చేసి కవిత కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ కోసం ఆమె ఆధ్వర్యంలో రాబోయే పార్టీకి తమ పూర్తి మద్దతు ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. సింగరేణి కార్మికులు, హెచ్ఎంఎస్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు, బీసీ సంఘాలు, అన్ని యూనివర్సిటీల విద్యార్థి సంఘాలు, తొలి మరియు మలి దశ ఉద్యమకారుల జేఏసీ, తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ, ఉద్యమకారుల జేఏసీ స్టేట్ కమిటీ, తెలంగాణ పొలిటికల్ జేఏసీ, ఆటో యూనియన్ నాయకులు, మహిళా సంఘాలు, కుల సంఘాల బాధ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు కవితను కలిసిన వారిలో ఉన్నారు. కవిత ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోయే పార్టీ ద్వారా తెలంగాణలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్న నమ్మకం ఉందని వారు తెలిపారు. మీతో కలిసి నడుస్తామని కవితకు ధైర్యం చెప్పారు. ఇందుకు కవిత సంతోషం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం పెట్టి ఇంత దూరం వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిరంతరం తన పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నడిచే ఈ ప్రయత్నానికి అందరి మద్దతు కోరారు.






మేడారం జాతరకు రండి

మేడారం మహా జాతరకు రావాలని బీజేపీ, ఎంఐఎం, సీపీఐ శాసనసభాపక్ష నేతలు ఏలేటిమహేశ్వర్‌రెడ్డి, అక్బరుద్దీన్ ఒవైసీ, కూనంనేని సాంబశివరావులకు మంత్రి సీతక్క ఆహ్వానపత్రికలు అందజేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి మంత్రి సీతక్క జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. - ప్రతిపక్షం, హైదరాబాద్

బీజేపీ వాషింగ్ మెషీన్‌లా మారింది



- ఎంత దోచుకున్నా ఏం చేసినా బీజేపీ సభ్యత్వం తీసుకుంటే చాలు
- అసెంబ్లీ వేదికగా బీజేపీ తీరుపై అక్బరుద్దీన్ ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి6: ఎంత దోచుకున్నా...మర్డర్ చేసినా...ఇంకేమీ చేసినా బీజేపీ సభ్యత్వం తీసుకుంటే క్లీన్‌గా మారిపోతారు అని ఎంఐఎం శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ మండిపడ్డారు. మంగళవారం శాసనసభలో పలు అంశాలపై జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ బీజేపీ వాషింగ్ మెషీన లా మారిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పాఠశాల విద్యపై మరింత ఖర్చు చేయాలి? అని ఆయన ప్రశ్నించారు. బాలకార్మికుల నియంత్రణకు కఠిన చర్యలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ విద్యపై సన్నగిల్లుతున్న నమ్మకం తప్పు అని ప్రభుత్వ విద్యే బెటర్ అని నిరూపించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా వర్సిటీల్లో నియామకాలు పూర్తి చేయాలని అక్బర్ కోరారు. ప్రభుత్వ తెలంగాణ రైజింగ్ 2047కు తాము పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. పాతబస్తీలో రోడ్లు విస్తరించాలని, ఆస్పత్రులు నిర్మించాలని, ఫ్లై ఓవర్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పవిత్ర స్థలాల వద్ద మద్యం దుకాణాలకు అనుమతులివ్వొద్దు

రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలు, మసీదులు, పవిత్రస్థలాలకు దగ్గరగా మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వద్దని, అక్కడ పవిత్రత కాపాడాలని అక్బరుద్దీన్ కోరారు. ప్రస్తుతం దర్గాలు, దేవాలయాల, పాఠశాలల దగ్గర ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను దూరంగా తరలించాలన్నారు. దీనితో పాటు పాఠశాలలు, కళాశాలల దగ్గరగా పాన్ షాప్ లు నిర్వహించకుండా చూడాలని కోరారు. అలాగే రాష్ట్రంలో నిషేదించిన గుట్కాల తదితర వస్తువుల విక్రయం యధేచ్చగా కొనసాగుతున్నదని, ప్రభుత్వం వీటిపై చర్యలు తీసుకొని నిషేధిత గుట్కా అమ్మకాలపై కొరఢా ఝులిపించాలని కోరారు. అలాగే ప్రభుత్వానికి ఎంత ఆదాయం వస్తుందో మంత్రి శ్రీధర్ బాబు తెలియజేయలేదని, ఆ వివరాలు తెలుపాలని అక్బర్ డిమాండ్ చేశారు.



కాంగ్రెస్ సీనియర్ నేత రామిరెడ్డికి

ఎమ్మెల్యే శంకర్ నివాళులు

ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 6: మహోన్నతం నీ సేవలు.. మరపురావు నీ జ్ఞాపకాలు.. నేతగా, కార్మిక నాయకుడిగా నిన్ను ఎప్పటికీ గుర్తుంచుకుంటాం..అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, కార్మిక నాయకుడు రామిరెడ్డికి మంగళవారం ఆయన ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ నేతగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కేవలం నాయకుడిగానే కాకుండా సేవకుడిగా కూడా ఎంతోమందికి అండగా నిలిచారని,ఆదర్శంగా ఉన్నారని అన్నారు. ఆయన లోతు తీర్చలేనిదని, ఆయన మన మధ్య లేకపోయినా మన జ్ఞాపకాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని ప్రశంసించారు. ఆయన కుటుంబానికి ఆ దేవుడు గుండె ధైర్యాన్ని ప్రసాదించాలని, ఆయన ఆత్మ శాంతించాలని కోరుకున్నట్లు వెల్లడించారు..




ఎస్సీ, ఎస్టీలపై దాడులను సహించబోం

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య
- సజ్జాపూర్ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 6 : ఎస్సీ, ఎస్టీలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడుల విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామంలో ఇటీవల బ్యాగరి రాములు ఇంటి కూల్చివేత ఘటనపై గత నెలలో బాధిత కుటుంబాన్ని కలిసి సంఘటనపై సమగ్ర విచారణ జరిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం సజ్జాపూర్ గ్రామానికి విచ్చేసిన కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ బాధితుడు బ్యాగరి రాములుకు రూ.25,000 పరిహార చెక్కును అందజేశారు. అనంతరం ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ బక్కి వెంకయ్య మాట్లాడుతూ బాధితుడికి పరిహారం అందజేయడానికే తాను వచ్చానని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై దాడుల విషయంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, బాధితులకు అండగా నిలవకుండా దాడి చేసిన వారి వైపు నిలవడం సరికాదని వ్యాఖ్యానించారు. గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని చెడగొట్టే చర్యలను సహించబోమని, ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితుడికి పూర్తి న్యాయం జరిగే వరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావు, ఆర్డీవో దేవుజా, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్ రెడ్డి, ఎంపీడీవో, తహసిల్దార్ సుప్రియ, పోలీస్ అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అట్రాసిటీ కేసులు, పోలీస్ మరియు రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలను సత్వరంగాపరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య అధికారులను ఆదేశించారు. జాప్యం చేసినట్లు దృష్టికి వస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద వివిధ శాఖల ద్వారా వెచ్చిస్తున్న నిధులు, తదితర అంశాలపై జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్, అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, అదనపు ఎస్పీ రఘునందన్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, డీఎస్పీలు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

రంజోల్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ

రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అన్ని విధాలా మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా రంజోల్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వసతి, భోజన ఏర్పాట్లు, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కమిషన్ చైర్మన్ సూచించారు. విద్యార్థులతో కలిసి కూర్చుని భోజనం చేసి భోజనం నాణ్యంగా ఉందని ప్రశంసించారు. అలాగే విద్యార్థులందరూ చదువుపై పూర్తి శ్రద్ధ పెట్టి, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు.



విద్యార్థులు ప్రశ్నించడం అలవర్చుకోవాలి

- ప్రొఫెసర్ రామచంద్రయ్య

ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 6 : విద్యార్థులు ప్రశ్నించడం నేర్చుకోవాలని ప్రశ్నించడం నేర్చుకున్నప్పుడే దేశం అభివృద్ధి బాటలో ఉన్నట్లని అన్ని ప్రొఫెసర్ రామచంద్రయ్య అన్నారు. మంగళవారం చిలుకూరు గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు జన విజ్ఞాన ఐక్యవేదిక అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మహా విస్ఫోటం, విశ్వం పుట్టుక, విస్తరణ, నక్షత్రాలు, గెలాక్సీలు వంటి ఆసక్తికర విషయాలు విపులంగా వివరించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థులు ప్రశ్నించడం నేర్చుకోవాలని ప్రశ్నించడం నేర్చుకున్నప్పుడే దేశం అభివృద్ధి బాటలో ఉన్నట్లని అన్ని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా సమాధానాలు తెలియకపోతే తెలుసుకొని చెప్పాలి తప్ప దాటవేసే పని చేయవద్దని సూచించారు. మన పెద్దలు అయితే తమ పిల్లలు అడిగే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అలా అడగొద్దు రా కళ్ళు పోతాయి అని చెబుతూ ప్రశ్న పుట్టుకని ఆపేసే ప్రయత్నం చేస్తారని అలా చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు రాష్ట్ర కమిటీ సభ్యులు డి సత్యం, కళాశాల ప్రిన్సిపల్, దేవేందర్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ శౌరి, చిలుకూరు పేరెంట్స్ కమిటీ చైర్మన్ బేగరి రాజు అధ్యాపకులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



సొంత నిధులతో అభివృద్ధి పనులు

- గ్రామస్తుల మన్ననలు పొందుతున్న సర్పంచ్ కుప్పే పద్మ గౌడ్

ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 6 : మండలంలోని అప్పారెడ్డిగూడ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా కొత్తగా ఎన్నికైన సర్పంచ్ కుప్పే పద్మగౌడ్ పదవిలోకి వచ్చిన కొద్ది రోజులకే పనులు ప్రారంభించి గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రభుత్వ నిధులు వచ్చే వరకు ఎదురుచూడకుండా, సొంత నిధులతోనే (దాదాపు 1లక్ష 50వేలు నిధులు)గ్రామంలో అత్యవసర అభివృద్ధి పనులు చేపట్టడం విశేషంగా మారింది.గ్రామంలో సంవత్సరాలుగా సమస్యగా మారిన మురుగు కాలువలను పూర్తిగా శుభ్రం చేయించారు. దీని వల్ల దుర్వాసన, దోమల బెడద తగ్గడమే కాకుండా, వర్షాకాలంలో నీరు నిలిచే సమస్యకు కూడా పరిష్కారం లభించింది. అలాగే కరెంటు స్తంభాల వద్ద ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను నరికివేయించి, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఇక గ్రామంలోని ప్రధాన వీధులు, అంతర్గత రహదారులు, ప్రజావసరాల ప్రాంతాల్లో విధుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర గణేష్,వార్డు సభ్యులు బాకారం ఎట్టమ్మ,బంటు దీపి కారాణి,ఎర్ర మహేష్, మాజీ సర్పంచ్ కొడుకు జమున కరణ్ కుమార్, గ్రామస్తులు ఊరడి ఆంజనేయులు,ఎర్ర కిష్టయ్య,చేగురి లక్ష్మయ్య, ఎర్ర నాగయ్య, ఎర్ర నర్సింహా, ఎర్ర సునీల్ కుమార్, ఉగ్గి సురేష్,ఎర్ర అనిల్ కుమార్, ఎర్ర చంద్రశేఖర్, జమున మానికేశ్వర్ తదితరులున్నారు.

ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడం శుభపరిణామం

- చిల్కూరు బాలాజీ ప్రధాన అర్చకులు సౌందర్ రాజన్



ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 6: మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ సంపూర్ణ రాములు సొంత నిధులు వెచ్చించి గ్రామ ఆలయాన్ని సుందరశోభితవనంగా తీర్చిదిద్దడం ఎంతో శుభపరిణామమని చిల్కూరు బాలాజీ ప్రధాన అర్చకులు సౌందర్ రాజన్ అన్నారు. మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామ చెన్నకేశవ ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి పరిశీలించారు. అనంతరం ఇంత సుందరంగా తీర్చిదిద్దిన సర్పంచ్ సంపూర్ణ రాములను అబినందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సొంత నిధులతో గ్రామ ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడం చాలా శుభపరిణామం అన్నారు. ఆలయ చుట్టూరా లక్షల రూపాయలు పెట్టి రోడ్డు వేయడం ఎంతో అబినందించదగ్గ విషయమన్నారు. ఇలాంటి వారికి ఆ భగవంతుని ఆశీర్వాదం తప్పక ఉంటుందని భవిష్యత్తులో ఇంకా చాలా ఉన్నత సాయికి ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోత్కుపల్లి గ్రామ పెద్దలు,యువకులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో

కాంగ్రెస్ జెండా ఎగరాలి

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 6: సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో తప్పకుండా కాంగ్రెస్ జెండా ఎగరాలని టీపీసీసీ వర్కింగ్‌ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన కార్యకర్తలు, నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రానున్న మూడు సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని, మరో ఐదేళ్లు కూడా అధికారాన్ని కొనసాగించేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి వార్డులో అభ్యర్థుల ఎంపికను ఆయా వార్డుల నాయకులే నిర్ణయించుకోవాలని, రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచినా, ఓడిపోయినా అప్పటి కౌన్సిలర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని చెప్పారు. బీసీ, ఎస్సీ వార్డుల మార్పుల నేపథ్యంలో గతంలో అక్కడ పోటీ చేసినవారు ఈసారి కూడా బాధ్యత వహించాలని ఆదేశించారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి కౌన్సిలర్ టికెట్లు ఇవ్వబోమని, పది సంవత్సరాలు పార్టీ కోసం కష్టపడ్డవారికి తొలి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చినవారికి రెండో ప్రాధాన్యత ఉంటుందన్నారు. తాను మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి రానని, ఎవరు పిలవొద్దని స్పష్టంగా పేర్కొన్నారు. అభ్యర్థులే ప్రచార బాధ్యత తీసుకొని ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరించి ఓట్లు అడగాలన్నారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలపై ఎలాంటి పరిస్థితుల్లోనైనా కాంగ్రెస్ జెండా ఎగరాలని, అవసరమైతే బతిమాలినా, దండం పెట్టినా విజయం సాధించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో చేసిన హామీలను అమలు చేయించే బాధ్యత తనదేనని చెప్పారు. సదాశివపేట మున్సిపాలిటీకి సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి ఆంజనేయులు, వాసిం భాయ్ ఇంచార్జులుగా వ్యవహరిస్తారని తెలిపారు. సంగారెడ్డి మున్సిపాలిటీకి తోపాజి అనంత్ కిషన్, చిద్రప్ప రఘు, జార్జ్, బొంగుల రవి ఇంచార్జులుగా ఉంటారని ప్రకటించారు. టికెట్ రాని వారు వ్యతిరేకంగా పనిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డబ్బులు ఉన్నవారనే కారణంతో బయటి వ్యక్తులకు టికెట్ ఇవ్వబోమని స్పష్టం చేశారు. సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూన సంతోష్, వైస్ చైర్మన్ అభ్యర్థిగా షఫీ హఫీజ్ ఉంటారని తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ వస్తే మహేష్ లాల్ చైర్మన్‌గా ఉంటారని చెప్పారు. సదాశివపేటలో ఎస్సీ రిజర్వేషన్ వస్తే చిరు చైర్మన్ అభ్యర్థిగా ఉంటారని వెల్లడించారు. కమిటీలు ఫైనల్ చేసిన అభ్యర్థులే తుది అభ్యర్థులని, టికెట్ల కోసం గాంధీ భవన్ వెళ్లి పార్టీ నేతలను ఇబ్బంది పెట్టొద్దని జగ్గారెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థులను ఓడగొట్టే ప్రయత్నం చేసిన వారిని ఎన్నికల సమయం అని చూడకుండా సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.



మన పిల్లల భవిష్యత్‌ను నిర్దేశించేదే తెలంగాణ రైజింగ్-2047. మనం కీలమైన మలుపు 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వద్ద ఉన్నాం. 1.2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని నిపుణులు చెబుతున్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదిగేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. తెలంగాణకు భారీగా స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయి. కఠినమైన లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకెళ్తున్నాం.

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఓపెన్ వాయిస్

తెగని నీళ్ల పంచాయితీ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయి ఇప్పటికే పదేళ్లు దాటుతున్నా, నదీ జలాల వివాదాలు మాత్రం ఇంకా తీరని సమస్యగానే కొనసాగుతున్నాయి. కొత్త కొత్త మలుపులు తిరుగుతూనే ఉన్నాయి. గోదావరి , కృష్ణా జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ మధ్య పోరు తీవ్రంగా సాగుతోంది. ఈ వివాదాలు కేవలం సాంకేతిక అంశాలకే పరిమితం కాకుండా, రాజకీయ సెంటిమెంట్‌గా మారడంతో పరిష్కారం మరింత క్లిష్టంగా తయారైంది. విడిపోయిన తర్వాత రెండు రాష్ట్రాలు కొత్త నీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాయి. పెరుగుతున్న జనాభా, సాగునీటి అవసరాలు, తాగునీటి డిమాండ్, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నీ కలిసి కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి దారితీస్తున్నాయి. అయితే కొత్త ప్రాజెక్టులు కట్టాలంటే నికర జలాలు ఎంత, మిగులు జలాలు ఎంత, సముద్రంలో వృథాగా కలిసే నీరు ఎంత అన్నది స్పష్టంగా తేలాల్సి ఉంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కుదిరిన వాటా నిష్పత్తులను పక్కనపెట్టి తెలంగాణ తనకు ఎక్కువ వాటా కావాలని కోరుతుండగా, గతంలో నిర్ణయించిన విధంగానే నీటి పంపిణీ జరగాలని ఏపీ వాదిస్తోంది. ఏపీ వాదన ప్రకారం, దిగువ రాష్ట్రంగా ఉన్న కారణంగా సముద్రంలో కలిసే వృథా నీటిని వినియోగించుకునే హక్కు తమకుందని చెబుతోంది. అదే ఆధారంగా బనకచర్ల వంటి కొత్త ప్రాజెక్టులను నిర్మించాలని భావిస్తోంది. కానీ తెలంగాణ మాత్రం దీనిని పూర్తిగా తిరస్కరిస్తోంది. తమ రాష్ట్రంలో కూడా ప్రాజెక్టులు నిర్మిస్తే మిగులు నీరు ఎంత ఉందో తేలుతుందని, సముద్రంలో కలిసే నీటిలో కూడా తమ వాటా ఉందని తెలంగాణ అభిప్రాయం. కృష్ణా జలాల విషయానికి వస్తే విభజన తర్వాత ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం వాటా కేటాయించారు. అయితే తెలంగాణ దీనిని అంగీకరించకుండా 5050 శాతం పంపిణీ కావాలని డిమాండ్ చేస్తోంది. మరోవైపు శ్రీశైలం , నాగార్జున సాగర్ వంటి ఉమ్మడి ప్రాజెక్టుల్లో నీటి వినియోగంపై స్పష్టమైన నియమాలు లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని ఎక్కువగా వినియోగించడం వల్ల ఏపీలో సాగునీటి అవసరాలు దెబ్బతింటున్నాయని ఆరోపణలు ఉన్నాయి.గోదావరి జలాల విషయంలో ఏపీకి 65 శాతం, తెలంగాణకు 35 శాతం వాటాలు నిర్ణయించారు. పోలవరం కారణంగా ముంపు ప్రాంతాలు పెరుగుతాయని తెలంగాణ అభ్యంతరం తెలుపుతుండగా, ఇది జాతీయ ప్రాజెక్ట్ అని కేంద్రం (ద్వారా నిర్మాణం జరుగుతోందని ఏపీ సమాధానం ఇస్తోంది. బనకచర్ల ప్రాజెక్టును నల్లమల సాగర్ గా పేరు మార్చి కొత్త డీపీఆర్ పంపినా, దానిపైనా అభ్యంతరాలు కొనసాగుతున్నాయి.ఈ వివాదాల మధ్య కోర్టు కేసులు, గ్రీన్ ట్రిబ్యునల్) స్టేలు కారణంగా ప్రాజెక్టులు నిలిచిపోతున్నాయి. అంచనా వ్యయాలు పెరుగుతుండగా, రైతులు నీటి హక్కులు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మన్ నేతృత్వంలో ఏర్పడిన ఈ కమిటీకి రెండు రాష్ట్రాల అధికారులు సభ్యులుగా ఉన్నారు. రాయలసీమలో నిర్మించ తలపెట్టిన పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబుతో మాట్లాడి తానే నిలుపుదల చేయించానని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఈ ప్రకటనపై మూడు పార్టీల నుంచి అభిప్రాయాలు వచ్చాయి. ముందుగా ఏపీ ప్రభుత్వం ఇది తప్పు అని.. రేవంత్ రెడ్డి చెప్పిన దాంట్లో నిజం లేదని తేల్చేసింది. గులాబీ పార్టీ సైతం ఏపీ ప్రభుత్వం చెప్పిందే నిజం అని పేరు చేసింది. కానీ ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తో చంద్రబాబు చీకటి ఒప్పందం అని ఆరోపిస్తోంది. అయితే ఇప్పుడు పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకం గురించి ప్రధానంగా చర్చ నడుస్తోంది. 2020లోనే పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. జగన్ ఈ ప్రాజెక్టు ప్రతిపాదన చేసిన సమయంలోనే తెలంగాణలో అధికార పార్టీగా ఉన్న బిఆర్ఎస్, విపక్షంలో ఉన్న కాంగ్రెస్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అప్పటి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు కూడా రాశాయి. అయితే కేవలం రాజకీయ ప్రయోజనాలకు.. తెలంగాణలో తన మిత్రుడు కేసీఆర్ కు లబ్ధి చేకూర్చే విధంగా.. జగన్మోహన్ రెడ్డి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, చిత్తశుద్ధి లేకుండా ఈ పథకాన్ని ప్రారంభించారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. 2020 తోనే ఈ ప్రాజెక్టు నిర్మాణం అలానే ఉండిపోయింది.జగన్మోహన్ రెడ్డి హయాంలో ఆ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని చెప్పడం లేదు. అసలు జగన్ ప్రస్తావన తేవడం లేదు. దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు హరీష్ రావు. జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి లేక నిలిపివేసిన ప్రాజెక్టు అది. కానీ అనవసరంగా చంద్రబాబు పేరు తీసుకొచ్చారు రేవంత్ రెడ్డి. తాను ఆపిన ప్రాజెక్టు నిర్మాణం శాపాన్ని చంద్రబాబు పై నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారు జగన్ మోహన్ రెడ్డి. అసలు టిడిపి, చంద్రబాబు గాలిపడని గులాబీ పార్టీ సైతం జగన్కు నష్టం లేకుండా ఆయన పేరు ప్రస్తావించడం లేదు. ఇలా తెలుగు రాష్ట్రాల రాజకీయాలు అన్ని చంద్రబాబు చుట్టూనే తిరుగుతున్నాయి.ఈ కమిటీ నివేదిక ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న ఆశ ఉన్నా, రాజకీయ సెంటిమెంట్లు అడ్డంకిగా మారతాయా అన్నదే ఇప్పుడు ప్రధాన చర్చ. ఏదేమైనా కేంద్ర జోక్యంతో అయినా ఈ జల జగడాలకు ముగింపు పడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రతిపక్షం

హైదరాబాద్,

బుధవారం
07.01.2026

శారీరక, మానసిక శ్రేయస్సు సంపూర్ణ ఆరోగ్యానికి రెండు చక్రాలు

మనిషి జీవనయానంలో ఆరోగ్యం అనేది ఒక మహా సముద్రం వంటిది. పైన కనిపించే అలలు శారీరక ఆరోగ్యమైతే, లోతుల్లో ఉండే నిశ్శబ్దం మానసిక శ్రేయస్సు. దురదృష్టవశాత్తు, నేటి ఆధునిక సమాజం అలల ఆర్భాటాన్ని చూసి మురిసిపోతోందే తప్ప, లోతుల్లో పెరుగుతున్న అశాంతిని గుర్తించడం లేదు. గడిచిన దశాబ్ద కాలంలో సాంకేతికత పెరిగినప్పటికీ, మనిషి అంతర్గత ప్రశాంతత క్రమంగా క్షీణిస్తోంది. శరీరం రోగగ్రస్తం కాకముందే మనసు కుంగిపోవడం నేటి విషాదకర పరిణామం.



జనక మోహన రావు దుంగ
8247045230


ఆరోగ్యం అంటే కేవలం శరీరానికి ఎటువంటి రోగము లేకపోవడమే కాదు.' శారీరక పటిష్టతతో పాటు మానసిక ప్రశాంతత, సామాజిక సామరస్యం ఉన్నప్పుడే ఆ వ్యక్తిని సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా పరిగణించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతుంది. శరీరానికి, మనసుకు మధ్య 'సైకోసోమాటిక్' సంబంధం ఉంటుంది. "సుస్థిర మనస్సు సుస్థిర శరీరంలో ఉంటుంది" అనే మాట నేడు అక్షర సత్యం. మనసులో కలిగే తీవ్రమైన ఆందోళనలు శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీసి, దీర్ఘకాలంలో రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులకు మూలకారణం అవుతున్నాయి. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల గుండె పోటు వచ్చే ప్రమాదం 40% పెరుగుతుందని, మనసులోని అలజడి నేరుగా రోగనిరోధక శక్తిని తగ్గించి, మనిషిని ఇతర వ్యాధుల బారిన పడేలా చేస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గణాంకాలు- ఆర్థిక ప్రభావం:

ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఎనిమిది మందిలో ఒకరు ఏదో ఒక మానసిక సమస్యతో బాధపడుతున్నారని గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం మనదేశంలో ఏడాదికి సుమారు 1.71 లక్షల మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇందులో అత్యధికం 18 నుండి 45 ఏళ్ల మధ్య వయస్సు వారే కావడం గమనార్హం. వీరిలో రోజువారీ కూలీలు 25%, గృహిణులు 14%, విద్యార్థులు 9% ఎక్కువగా ఉండటం సామాజిక సంక్షోభాన్ని సూచిస్తోంది. ఆత్మహత్యలకు అధిక శాతం ఒత్తిడే కారణం అని విశ్లేషకుల అభిప్రాయం. మానసిక సమస్యల వల్ల ఉద్యోగుల పనితీరు తగ్గడం, సెలవులు పెరగడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు వచ్చే దశాబ్ద కాలంలో సుమారు ఒక ట్రిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుందని అంచనా. అంటే మానసిక ఆరోగ్యం కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, అది దేశాభివృద్ధిని కుంగదీసే ఆర్థిక సంక్షోభం కూడా.

సమాజం - పని వాతావరణం:

మానవుడు సంఘజీవి. సమాజంలో జరిగే మార్పులు వ్యక్తి మానసిక స్థితిని ప్రభావితం చేస్తాయి. కేవలం వ్యక్తిగత బలహీనతలు మాత్రమే మానసిక జబ్బులకు కారణం కావు. వీటితోపాటు అన్యాయం, హింస, పేదరికం, ఆస్తుల దురాక్రమణ, అప్పుల బాధ, విపరీతమైన పోటీతత్వం మనిషిని నిరాశలోకి నెడుతున్నాయి. సామాజిక రుగ్మతలు మనిషిని నిరంతరం అభద్రతా భావంలో ఉంచుతున్నాయి. వలసలు, పట్టణీకరణ వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై, సామాజిక మద్దతు కరువైంది. నేడు పని ప్రదేశాల్లో ఎనిమిది గంటల పని విధానం మృగ్యమైంది. టార్గెట్లు, డెడ్‌లైన్ల మధ్య ఉద్యోగి 'రోబో'గా మారుతున్నాడు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు అటు ఆఫీసు బాధ్యతలు, ఇటు ఇంటి పనులు నిర్వహిస్తూ 'డబుల్ బర్డెన్'కు గురవుతున్నారు. ఆఫీసులో వివక్షను, ఇంట్లో బాధ్యతలను సమన్వయం చే



సుకోలేక 'క్రానిక్ ఫెటీగ్' అంటే తీవ్ర అలసటకు గురవుతున్నారు. స్మార్ట్‌ఫోన్ వాడకం పెరిగిన తర్వాత ఒంటరితనం మరింత పెరిగింది. వర్చువల్ ప్రపంచంలో వేలమంది మిత్రులున్నా, బాధను పంచుకోవడానికి పక్కన మనిషి లేని స్థితి నేటి యువతది. ఇది కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితం కాలేదు.

గ్రామీణ భారతం - నిశ్శబ్ద వేదన:

గ్రామీణ ప్రాంతాల్లో మానసిక ఆరోగ్య స్థితి అత్యంత జటిలంగా ఉంది. నగరాల్లో మానసిక వైద్యులు అందుబాటులో ఉన్నప్పటికీ, గ్రామాల్లో ఈ సౌకర్యాలు నామమాత్రంగానే ఉన్నాయి. ఇక్కడ మానసిక సమస్యలను వైద్యపరమైన ఇబ్బందిగా చూడకుండా 'దెయ్యం పట్టిందని' లేదా 'దిష్టి తగిలిందని' మూఢనమ్మకాలతో చూడటం వల్ల రోగులకు సరైన సమయానికి చికిత్స అందడం లేదు. ముఖ్యంగా రైతులు ప్రకృతి వైపరీత్యాలు, పెరిగిన సాగు ఖర్చులు, గిట్టుబాటు ధర లేక అప్పుల ఊబిలో కూరుకుపోయి తీవ్రమైన మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారు. సామాజిక గౌరవం పోతుందన్న భయంతో వీరు తమ బాధను ఎవరికీ చెప్పుకోలేక ఆత్మహత్యల వంటి దారుణ నిర్ణయాలు తీసుకుంటున్నారు.

పల్లెల్లో సామాజిక మద్దతు- మార్పు:

ఒకప్పుడు పల్లెల్లో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మానసిక ఒత్తిడికి విరుగుడుగా ఉండేది. కష్టసుఖాలను పంచుకోవడానికి పెద్దలు ఉండేవారు. కానీ నేడు గ్రామాల్లో కూడా ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్న కుటుంబాలు ఏర్పడటం వల్ల ఒంటరితనం పెరిగిపోయింది. గ్రామీణ యువతలో నిరుద్యోగం, నగరాలకు వలసలు వెళ్లడం వల్ల వృద్ధులు గ్రామాల్లో ఒంటరిగా మిగిలిపోతున్నారు. దీనివల్ల వారిలో మానసిక ఆందోళనలు పెరిగి శారీరక ఆరోగ్యం కూడా క్షీణిస్తోంది.

పరిష్కార మార్గాల అన్వేషణ:

మానసిక సమస్యల నుంచి గట్టెక్కడానికి బహుముఖ వ్యూహం అవసరం. చిన్న విజయాలను సెలబ్రేట్ చేసుకోవడం, పోలికలు మానుకోవడం ముఖ్యం. 'నో' చెప్పడం నేర్చుకోవడం వల్ల అనవసరపు బాధ్యతల నుంచి తప్పించుకోవచ్చు. వ్యాయామం వల్ల శరీరంలో 'ఎండార్ఫిన్', 'డోపమైన్' వంటి హ్యాపీ హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి సహజసిద్ధమైన స్ట్రెస్ రిలీజర్లుగా పనిచేస్తాయి. నిద్రలేమి వల్ల చిరాకు, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు వస్తాయి. అందువలన రోజుకు 78 గంటల నిద్ర అవసరం. ఇది మెదడును రీచార్జ్ చేస్తుంది. ప్రాసెస్ చేసిన ఆహారం తగ్గించి, తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. హోలిస్టిక్ అప్రోచ్ పద్ధతి అంటే కేవలం మందుల ద్వారానే కాకుండా యోగా, ధ్యానం, శ్వాస క్రియల ద్వారా మనసును నియంత్రించవచ్చు. ప్రకృతితో సమయం గడపడం 'నేచురల్ హీలింగ్'లా పనిచేస్తుంది. మానసిక వైద్యుడిని సంప్రదించడం అంటే 'పిచ్చి' అని భావించే అపోహ తొలగాలి. గ్రామీణ ప్రాంతాల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం నేటి అత్యవసర అవసరం. మూఢనమ్మకాల నుంచి ప్రజలను బయటకు తీసుకువచ్చి, శాస్త్రీయ చికిత్స పట్ల నమ్మకం కలిగించాలి. జ్వరం వస్తే డాక్టర్ దగ్గరికి వెళ్లినట్టే, మనసు బాగోలేనప్పుడు థెరపీ తీసుకోవడం సాధారణ విషయంగా మారాలి. పాఠశాల స్థాయి నుంచే 'మెంటల్ హెల్త్ కరికులమ్'ను ప్రవేశపెట్టాలి. ఒత్తిడిని ఎలా జయించాలి? విఫలమైనప్పుడు ఎలా నిలబడాలి? అనే విషయాలను పిల్లలకు నేర్పాలి. అలాగే ప్రతి కార్యాలయంలో 'ఎంప్లాయీ వెల్‌నెస్ ప్రోగ్రామ్స్' తప్పనిసరి చేయాలి. శారీరక ఆరోగ్యం పునాది అయితే, మానసిక శ్రేయస్సు ఆ పునాదిపై నిర్మించబడిన అందమైన భవనం. ఆరోగ్యం అంటే కేవలం రోగం లేకపోవడం కాదు, అది మనిషి తన సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోగల శక్తిని కలిగి ఉండటం. "మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది". మనసును గెలిచిన వాడు ప్రపంచాన్ని గెలుస్తాడు. కాబట్టి, శరీరాన్ని కదిలిద్దాం. మనసును ప్రశాంతంగా ఉంచుదాం. మనిషి తనను తాను ప్రేమించుకున్నప్పుడే ఇతరులను ప్రేమించగలడు, తద్వారా ఆరోగ్యకరమైన సమాజం నిర్మించబడుతుంది.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

శాంతి ముసుగులో యుద్ధ తంత్రం..!



వెంక గారి భూమయ్య
9848559863

అంతర్జాతీయ దౌత్య రంగంలో డొనాల్డ్ ట్రంప్ ఒక అంతుచిక్కని ప్రహసనం. ఒకవైపు శాంతి దూతగా నోబెల్ బహుమతి కోసం పాకులాడటం, మరోవైపు సార్వభౌమ దేశాలపై సైనిక దాడులకు తెగబడటం ఆయనకే చెల్లింది. 2026 నోబెల్ శాంతి బహుమతి నామినేషన్ల చర్చ నడుస్తున్న తరుణంలో, ట్రంప్ తనను తాను ఒక 'విశ్వశాంతి మూర్తి'గా అభివర్ణించుకుంటున్నారు. కానీ, చరిత్రను, వర్తమాన పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే.. ఆయన శాంతి ప్రయత్నాల వెనుక బలమైన రాజకీయ స్వార్థం, అగ్రరాజ్య అహంకారం తప్ప మానవతా దృక్పథం ఎక్కడా కనిపించదు.

భారత్-పాక్ అంశం..

మధ్యవర్తిత్వం పేరిట మేకపోతు గాంభీర్యం

భారత్ మరియు పాకిస్తాన్ మధ్య నెలకొన్న దశాబ్దాల నాటి సున్నితమైన సమస్యలను ట్రంప్ ఒక 'వ్యాపార ఒప్పందం'లా మార్చాలని చూశారు. గతంలో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు "నేనే మధ్యవర్తిత్వం వహించి యుద్ధాన్ని ఆపాను" అని ఆయన చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదం. కాశ్మీర్ సమస్యపై భారతదేశం ఎప్పుడూ తన స్పష్టమైన వైఖరిని చాటింది——ఇది ద్వైపాక్షిక అంశం, ఇందులో మూడో పక్షం జోక్యం నిషిద్ధం. అయినప్పటికీ, ట్రంప్ పదేపదే మధ్యవర్తిత్వం పేరిట తన ప్రాముఖ్యతను పెంచుకోవాలని చూశారు. పాకిస్తాన్ తన మనుగడ కోసం అమెరికాను ఆశ్రయించడం సహజం, కానీ ఒక అగ్రరాజ్య అధినేతగా ట్రంప్ వాస్తవాలను విస్మరించి క్రెడిట్ అంతా తన ఖాతాలో వేసుకోవాలనుకోవడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం. భారత్ తన సైనిక శక్తితో, వ్యూహాత్మక సంయమనంతో సాధించిన శాంతిని తన ఖాతాలో వేసుకోవడం ఒక రకమైన 'మేధోపరమైన నీచత్వం' కాదా?

నోబెల్ శాంతి బహుమతి.. గౌరవం గంగపాలేనా?

నోబెల్ శాంతి బహుమతికి ఒక పవిత్రత ఉంది. నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్ వంటి మహానుభావుల అడుగుజాడల్లో నడిచే వారికి దక్కాల్సిన ఈ పురస్కా



రం కోసం ట్రంప్ పాకులాడటం ఆశ్చర్యం కలిగిస్తుంది. గతంలో జపాన్ ప్రధానిని ఒప్పించి తన పేరును నామినేట్ చేయించుకున్నారనే ఆరోపణలు ఆయనకు ఈ అవార్డుపై ఉన్న పిచ్చిని తెలియజేస్తున్నాయి. శాంతి అంటే కేవలం యుద్ధాలను వాయిదా వేయడం కాదు, యుద్ధం రావడానికి గల కారణాలను తొలగించడం. కానీ ట్రంప్ హయాంలో ప్రపంచ దేశాల మధ్య విభజన రేఖలు పెరిగాయి. పారిస్ వాతావరణ ఒప్పందం వంటి అంతర్జాతీయ ఒప్పందాల నుంచి తప్పుకోవడం ద్వారా ప్రపంచ భవిష్యత్తును పణంగా పెట్టిన వ్యక్తికి శాంతి బహుమతి ఏ రకంగా ఇస్తారు?

వెనిజులా ఉదంతం..

శాంతి కాముకుడి అసలు స్వరూపం

ప్రస్తుతం వెనిజులాపై ట్రంప్ సాగిస్తున్న సైనిక చర్య ఆయన ద్వంద్వ నీతిని ప్రపంచం ముందు బట్టబయలు చేసింది. 'ఆపరేషన్ అబ్సొల్యూట్ రిజాల్వ్' పేరుతో ఒక స్వతంత్ర దేశంపై బాంబుల వర్షం కురిపించడం, అక్కడి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం ఏ రకమైన శాంతి స్థాపన? ఇతర దేశాలకు ప్రజాస్వామ్య సూక్తులు చెప్పే అమెరికా, వెనిజులాలోని సహజ వనరులను, ముఖ్యంగా చమురు నిల్వలను చేజిక్కించుకోవడానికి యుద్ధానికి తెగబడటం అత్యంత విచారకరం. "వెనిజులాను మేమే పాలిస్తాం" అన్నట్లుగా ఆయన వ్యవహరిస్తున్న తీరు ఆధునిక కాలపు సామ్రాజ్యవాదాన్ని తలపిస్తోంది. ఒకవైపు నోబెల్ కోసం జబ్బలు కొట్టుకుంటూ, మరోవైపు అమాయక ప్రజల ప్రాణాలు తీయడం ఆయన నైజంలోని వైరుధ్యాన్ని ఎత్తి చూపుతోంది.

ప్రపంచం ముందు ఒక 'నీచకుడి' చిత్రం

అధికారం కోసం, వ్యక్తిగత ఇమేజ్ కోసం ఏ స్థాయికైనా దిగజారే మనస్తత్వం ట్రంప్‌ది. ప్రపంచ దేశాలు ఇప్పటికైనా గుర్తించాల్సిన విషయం ఏమిటంటే, ట్రంప్ దృష్టిలో శాంతి అనేది ఒక 'ఈవెంట్' మాత్రమే. ఆయనకు కావలసింది ప్రపంచ శాంతి కాదు, తన పేరు ముందు 'నోబెల్ గ్రహీత' అనే బిరుదు మాత్రమే. ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని కాలరాస్తూ, యుద్ధాలను సృష్టించే వ్యక్తి శాంతి దూత ఎలా అవుతాడు? వెనిజులాలో చిందుతున్న రక్తం, భారత్‌పాక్ విషయంలో ఆయన ఆడుతున్న రాజకీయ క్రీడ.. ఇవన్నీ ఆయనను ఒక అగ్రరాజ్య నేతగా కంటే, ఒక అవకాశవాదిగానే నిలబెడుతున్నాయి.

శాంతి స్థాపన.. ప్రచార ఆర్భాటం కాదు!

నిజమైన శాంతి సైనికుడికి అవార్డుల మీద ఆశ ఉండదు. కానీ ట్రంప్ ప్రతి అడుగులోనూ స్వార్థం కనిపిస్తోంది. వెనిజులాలో యుద్ధం చేస్తూ, దక్షిణ ఆసియాలో శాంతి దూతగా నటిస్తున్న ఈ 'ద్వంద్వ పాత్ర'ను ప్రపంచ దేశాలు ఎండగట్టాలి. నోబెల్ కమిటీ కూడా రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా, నిజమైన శాంతి కాముకులను గుర్తించాల్సిన బాధ్యత ఉంది. లేనిపక్షంలో, శాంతి అనే పదానికి అర్థమే మారిపోయే ప్రమాదం ఉంది. ట్రంప్ చేస్తున్నది 'శాంతి స్థాపన' కాదు, శాంతి ముసుగులో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి చేస్తున్న 'యుద్ధం'. ఇలాంటి నాయకుడిని ప్రపంచం శాంతి దూతగా కాక, శాంతికి విఘాతకర్తగానే గుర్తించాలి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

రాష్ట్ర బీజేపీలో 'అష్ట' కష్టాలు!?



అంబీర్ శ్రీకాంత్
8185968059

తమది ప్రపంచంలోనే బలమైన పార్టీ అని బీజేపీ లీడర్లు చెబుతుంటారు. కానీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి సీట్లు తగ్గిన సంగతి విదితమే. ఇక దక్షిణ భారతదేశంలో తెలంగాణలో తామే పాగా వేయబోతున్నామనే సంకేతాలను బలంగా పంపిన కమలనాథులు అంతర్గత కలహాలు, కుమ్ములాటలతో సతమతమవుతున్నారు.అమిత్ షా, మోడీ ద్వయం పాచికలు తెలంగాణలో పారడం లేదా? అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.

గ్రౌండ్‌లో బలమేది?

తమ బలం క్షేత్రస్థాయిలో పెరిగిందని కమలనాథులు బీరాలు పలుకుతున్నారు. కానీ, గ్రౌండ్ రియాలిటీలో ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీగా అవతరించాలనుకున్న బీజేపీ ఏ మేరకు ఎన్నికల్లో గట్టిగా ఫలితాలు సాధించి సత్తా చాటి.. తమ పనితీరు ప్రదర్శించగలిగింది? అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. యాదృచ్ఛికమో ఏమో తెలియదు కానీ, రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు(లోక్‌సభ) ప్రజల నుంచి ఎన్నికైనా జనక్షేత్రంలో ఆ మేరకు ప్రజల మద్దతు, ఆదరాభిమానాలను పార్టీ చూరగొనేలా ఎంత వరకు చేస్తున్నారనేది? ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇటీవల స్వయంగా పార్టీకి సుప్రీం, దేశ ప్రధానమంత్రి తెలంగాణ బీజేపీ ఎంపీలను పిలిపించుకుని మరీ క్లాస్ ఇచ్చినట్లు వార్తలొచ్చాయి. 'నిప్పులేనిదే పొగ రాదు' అని పెద్దలు చెబుతుంటారు. తొలుత పార్టీలోని అంతర్గత సమస్యలు పరిష్కారమైతేనే కమలవికాసం జరుగుతుందనే వాదన రాజకీయ వర్గాల్లో ఉంది. ఓ వైపున తమ మూల సిద్ధాంతమైన హిందూత్వతోనే మరోసారి అధికారం చేజిక్కిందని, తెలంగాణలోనూ దాని ఆధారంగానే అధికారంలోకి వస్తామని ఓ నేత చెబుతున్నారు. దానిని వ్యతిరేకిస్తూ.. సొంత పార్టీకి చెందిన మరో లీడర్.. తెలంగాణలో కులం, మతం ఆధారంగా ఓట్లు పడబోవని, తెలంగాణలో డివిజన్ పాలిటిక్స్ నడవబోవని కామెంట్స్ చేయడం చూస్తే.. రాష్ట్రంలో పార్టీ ఎంత మేరకు ఏకతాటిపై ఉందో? ఇట్టే అవగతమవుతుంది. నిత్యం ఒకరిపై మరొకరు ఆధిపత్యం సాధించేలా వ్యవహరిస్తున్న తీరుతో పలువురు రాష్ట్ర బీజేపీ నాయకులే తలలు పట్టుకుంటున్నట్టుగా తెలుస్తున్నది. బీజేపీ హై కమాండ్ ఎందుకు అసలు



తెలంగాణ బీజేపీని గట్టిగా పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని ఆఫ్ ది టాక్‌లో చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికైనా బీజేపీ నేతలు ఏకతాటిపైకి వచ్చి.. భేదాభిప్రాయాలను పక్కన పెడితేనే.. రాష్ట్రంలో ప్రతిపక్షమో.. అధికారంలో రాగలిగిన పక్షమో? ఏదో ఒక స్థానం ఉంటుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. సేమ్ ఇలాగే పార్టీలో కలహాల సీన్‌ను రిపీట్ మోడ్‌లో కొనసాగిస్తే.. బీజేపీ అధిష్ఠానం ఎన్ని జాకీలు పెట్టి లేపినా రాష్ట్ర బీజేపీ మరింతగా భూమి లోతుల్లోకి జలం ఇంకినట్టుగా పాతాళంలోనే ఉంటుందని పేర్కొంటున్నారు.



ప్రాంతీయం

గీతంను సందర్శించిన డీఏవీ విద్యార్థులు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 6 : గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఇటీవల ఐఐటీ హైదరాబాదు ప్రాంగణంలోని డీఏవీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల కోసం ఒక ఆసక్తికరమైన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించింది. వాస్తుశిల్పం, డిజైన్ ప్రపంచానికి సంబంధించిన విజ్ఞానదాయన పరిచయాన్ని అందించింది. పాఠశాల విద్యా విజ్ఞాన కార్యక్రమాలలో భాగంగా, డీఏవీలోని 10, 11, 12 తరగతులకు చెందిన 58 మంది విద్యార్థులు, మరో ముగ్గురు అధ్యాపకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్శనలో భాగంగా, పలు ముఖాముఖి కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు, విద్యార్థులు చేపట్టిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇవి గీతంలోని విద్యా వాతావరణం, సృజనాత్మక సంస్కృతిని వెల్లడించాయి. స్టూడియో ఆధారిత అభ్యాసం, డిజైన్ ఆలోచన, అంతర్ విభాగ విధానాలతో సహా ఆర్కిటెక్చరల్ విద్య యొక్క ప్రధాన అంశాలను ఆర్కిటెక్చర్ అధ్యాపకులు, విద్యార్థి రాయబారులు పరిచయం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్. శ్రుతి గాల్లి నిర్వహించిన మందాల కార్యశాల ఈ పర్యటనకే తలమానికంగా నిలిచింది. లయబద్ధమైన సంగీతం నేపథ్యంలో స్టూడియో వాతావరణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యశాల విద్యార్థులను నమూనా తయారీ, కూర్పు, దృశ్య వ్యక్తీకరణను అన్వేషించేలా ప్రోత్సహించింది. అదే సమయంలో అవగాహన, సృజనాత్మక వాతావరణాన్ని కూడా పెంపొందించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆర్. స్నిగ్ధా రాయ్, ఆర్. శృతి గాల్లి, విద్యార్థి రాయబారులు మౌన్య, వేదాంశ్ ఫెయిత్, అరిత్ర తదితరులు డీఏవీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆర్కిటెక్చర్ లో కెరీర్ అవకాశాలు, ప్రాంగణ జీవితం, సమస్యల పరిష్కారంలో సృజనాత్మకత యొక్క ప్రాముఖ్యతకు సంబంధించిన ప్రశ్నలకు వారు సమాధానాలు ఇచ్చారు. గీతం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన తీరు, ముఖాముఖి సంభాషణలను డీఏవీ బృందం ప్రశంసించింది.



పూలే డిగ్రీ కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తా

ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 6: సావిత్రిబాయి పూలే డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు సమస్యలను పరిష్కరిస్తానని పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశి స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో గల సావిత్రిబాయి పూలే డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులతో మంగళవారం వారు మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే కళాశాలలో పక్క భవరాలను నిర్మించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల చదువుల విషయంలో నాణ్యత మైన విద్య అందించడంలో కట్టుబడి ఉందన్నారు. విద్య వైద్యం మౌలిక సదుపాయాలు కల్పించడంలో తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు తమ చదువులలో వందకు వందశాతం ఉత్తీర్ణతలు సాధించేందుకు బోధక సిబ్బంది పనిచేయాలని సూచించారు. విద్యార్థుల పట్ల బోధకులు శ్రద్ధ వహించాలని కోరారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి సుధా మల్ల హరికృష్ణ నల్ల రవి తదితర నాయకులు పాల్గొన్నారు.



ప్రతి విద్యార్థి ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం, హనుమకొండ, జనవరి 6: హనుమకొండ వడ్డేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రతి విద్యార్థి ఆంగ్ల భాష పై పట్టు సాధించే విధంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. మంగళవారం హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఇంగ్లీష్ ఎన్రిచ్మెంట్ ప్రోగ్రాం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆంగ్ల, తెలుగు, హిందీ భాష లో విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఆంగ్ల భాషలో ఆశించిన స్థాయిలో ప్రావీణ్యం చూపకపోవడంతో కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆంగ్ల భాషబోధనను మరింత ప్రభావవంతంగా నిర్వహించాలని, విద్యార్థుల చదువు నైపుణ్యాలను మెరుగుపరచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులతో ఇంగ్లీషులోనే మాట్లాడాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, వంటగదిని కలెక్టర్ పరిశీలించారు. భోజన పదార్థాలను తనిఖీ చేశారు. మెనూను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజు గౌడ్, ఎంఈఓ నెహ్రూ, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.



నోడల్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , జనవరి 6: రానున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి బాధ్యతతో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నియమించబడిన నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణ సిద్ధతపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,సంబంధిత నోడల్ అధికారులు ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో ముందుగానే సిద్ధంగా ఉండాలని, తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలను కచ్చితంగా పాటించాలని, ఎక్కడా అలసత్వానికి తావివ్వకూడదని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని, శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత తహసిల్దార్లు పాల్గొన్నారు.

సమ్మక్క జాతర వ్యాపారాల వేలం



ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 6: తెలంగాణ రాష్ట్రంలో రెండు ఏళ్లకు ఒకసారి జరిగే జాతరలో అనుసరించి మంచిర్యాల జిల్లా కేంద్రంలో సమ్మక్క సారక్క వ్యాపారాలు వేళలు మంగళవారం అధికారులు నిర్వహించారు జిల్లా కేంద్రంలోని గోదావరి తీరంలో కాలేజ్ రోడ్ల గల గౌతమేశ్వరం ఆలయం సమ్మక్క సారక్క గద్దెల సమీపంలో దేవాదాయ శాఖ అధికారులు వేలం పాటలు నిర్వహించారు జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కాకుండా వ్యాపారస్తులు భక్తులకు అధిక ధరలకు అమ్మటాన్ని నియంత్రించేందుకు ఈ చర్యలు చేపట్టారు ఈనెల 28 29 30 తేదీలలో జరిగే సమ్మక్క సారక్క జాతరకు వచ్చే భక్తులకు కోళ్లు బెల్లం పేలాలు కొబ్బరికాయలు కుంకుమ తగరవత్తులు శీతల పానీయాలు తదితర అంశాలకు వేలం నిర్వహించడం జరిగింది బహిరంగ వేళల్లో పాల్గొని వ్యాపారస్తులు తమ వ్యాపారాలు నిర్వహించేందుకు పోటీపడుతూ ఒక్క వ్యాపారి వద్ద నుండి 50,000 డిపాజిట్ గా తీసుకొని వేలంపాట ప్రారంభించారు ఈ కార్యక్రమంలో దేవాలయం శాఖ అధికారి ఈవో రవి దేవాలయం శాఖ సిబ్బంది వ్యాపారస్తులు సమ్మక్క సారక్క కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మహిళల రక్షణ కోసం 'ఆన్ లైన్ షీ బాక్'

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 6: మహిళల రక్షణ నివారణ పరిష్కారం గురించి చట్టం పనిచేస్తుందని, చట్టంలో ఇంటర్నల్ కమిటీ లోకల్ కమిటీలు ఫామ్ చేయాల్సిన బాధ్యత ప్రతి జిల్లా అధికారులకు ఉందని, మహిళల లైంగిక సమస్యల కు గురైనప్పుడు ఆన్లైన్ షీ బాక్స్ పోర్టల్ లో పిటిషన్ దాఖలు చేసుకునేలా షీ బాక్స్ పనిచేస్తుందని కలెక్టర్ ఆశిష్ సంగవాన్ అన్నారు. కమిటీ మెంబర్స్ వివరాలు అందరికీ కనబడేలా ప్రతి జిల్లా అధికారులు ప్రదర్శించాలనీ ఆయన సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం బేటి బచావో బేటి పడావో ప్రోగ్రాం లో భాగంగా జిల్లా స్థాయి అధికారులకు మరియు సిబ్బందికి పని ప్రదేశాలలో మహిళల పై లైంగిక వేధింపుల చట్టం పైన అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. కలెక్టర్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఎల్ ఎస్ ఏ సెక్రటరీ టి నాగరాణి, అడిషనల్ కలెక్టర్ మధుమోహన్, డి డబ్ల్యూ ఓ ప్రమీల, డిఆర్డిఏ పిడి, డిఎంహెచ్ఓ డాక్టర్ విద్య ఎక్సైజ్ హనుమంతు, ఎల్ సి మెంబర్స్ స్వర్ణలత, షబానా పాల్గొన్నారు. పురుషులు సమానంగా పనిచేస్తున్నారని పని ప్రదేశాలలో మహిళలు ఇలాంటి హింసకు గురికాకుండా గౌరవంగా ఉండేలా అధికారులు చూసుకోవాలని, మహిళలు ఆత్మవిశ్వాసంతో ఉండి తనకు తాను రక్షించుకోవాలని మహిళల సమస్యల కు గురైనప్పుడు ప్రతి మహిళ ధైర్యంగా షీ బాక్స్ వినియోగించుకోవాలని ఈ పోర్టల్ గోప్యంగా పనిచేస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది సిడిపివో సూపర్వైజర్స్ స సఖి సిబ్బంది ఐ సి పి ఎస్ సి హెచ్ఎల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.



విద్యుత్ సమస్యల పరిష్కారానికే 'ప్రజాబాట'

- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

ప్రతిపక్షం, హనుమకొండ, జనవరి 6: విద్యుత్ వినియోగదారుల వద్దకు నేరుగా వెళ్లి వారి విద్యుత్ సమస్యలను తెలుసుకొని పరిష్కరించే కార్యక్రమమే 'ప్రజా బాట' అని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం హన్మకొండ సర్కిల్ పరిధిలో ఎస్ ఎస్ 29 , భవానినగర్ నక్కలగుట్ట సెక్షన్ లో ''ప్రజాబాట కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి కాలనీ వాసులతో కలసి నేరుగా తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వాళ్ల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడమే ప్రజా బాట లక్ష్యమని సీఎండీ అన్నారు. వారంలో మూడు రోజులు (ప్రతి మంగళవారం, గురువారం ,శనివారం) ప్రజా బాట నిర్వహించబడుతుందని అన్నారు. అన్నిసర్కిళ్లలో డిఈ, ఏడిఈ, ఏఈలు విడివిడిగా క్షేత్ర స్థాయిలో, సిబ్బందితో కలిసి గ్రామాలను నేరుగా సందర్శించాలన్నారు .11 కెవి ఫీడర్లు వారిగా గ్రామాలను షెడ్యూల్ చేసి కార్యక్రమం తేదీకి ఒక రోజు ముందుగానే సర్కిల్ వాట్స్ అప్ గ్రూపులలో పోస్ట్ చేస్తూ , అలాగే ఆ ప్రాంత వినియోగదారులకు తెలిసేలా వాట్స్ అప్ గ్రూపులలో ప్రచారం చేయాలనీ అన్నారు. 11 కేవీ లైన్లు, డీటీఆర్ స్ట్రక్చర్లు ఎల్ టి లైన్లలోని లోపాలను అక్కడికక్కడే గుర్తించి, సరిచేయాలన్నారు. ఒక వేళ అక్కడికక్కడే సరిదిద్దలేనివి పక్షంలో తరువాత తేదీలో సరిదిద్దడానికి ఏర్పాట్లు చేయాలన్నారు . తరచుగా ట్రిప్పింగ్ ఫీడర్ల క్షేత్ర స్థాయి తనిఖీలు చేయాలని , లోడ్ బ్యాలెన్సింగ్, ఫీడర్ విభజన నిర్వహణ పగిలిపోయిన ఇన్సులేటర్లు , లోపభూయిష్టంగా ఉన్న జంపర్లను సరిచేయలని అన్నారు . వంగిన పోల్ సరిదిద్దడం లాంటి పనులు చేపట్టి వినియోగదారులలో మరింత నమ్మకం , విశ్వనీయతను పెంపొందించాడనికి ప్రతి ఒక్క ఉద్యోగి నిబ్బద్దత్తో పని చేయాలని ఈ సందర్భంగా కోరారు . ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్ శ్రీ . టి . మధుసూదన్ , సీజియం కె . రాజు చౌహన్ , హన్మకొండ ఎస్ఈ పి. మధుసూదన్ రావు , డి .ఈ హన్మకొండ సాంబ రెడ్డి , డి .ఈ టెక్నికల్ ఏ. విజయేందర్ రెడ్డి, దర్శన్ కుమార్ , ఏ.డి.ఈ ఇంద్రసేనా రెడ్డి , ఏఈ ప్రవీణ్ , స్థానిక ప్రజా ప్రతినిధులు , కాలనీ వాసులు పాల్గొన్నారు .



ఓటరు లిస్టులో తప్పులు సవరించాలని ఆర్డీవోకు వినతి

ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 6: మంచిర్యాల కార్పొరేషన్ మునిసిపాలిటీలలో ముక్సాయిదా ఓటర్ లిస్టులో తప్పులు దొర్లి ఉన్నాయని తెలియజేస్తూ మంచిర్యాల ఆర్డిఓ కు బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర గౌడ్ నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు అధికార పార్టీ చొరవతో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఓటర్ లిస్టులో అనేక తప్పులు ఉన్నాయని వెంటనే తప్పులు సవరించాలని ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బెల్లంకొండ మురళి మచ్చ వెంకటేశ్వర్లు దుర్గం అశోక్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదలయ్యేలా చర్యలు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

ప్రతిపక్షం, సిద్దిపేట, జనవరి 6: కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదలయ్యేలా ఫైనాన్స్ మంత్రితో మాట్లాడుతనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సన్‌పల్లి గ్రామంలోని బాలికల గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 650 మంది విద్యార్థులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు మంగళవారం రాత్రి బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీల విషయమై రాష్ట్ర ఆర్థిక మంత్రితో మాట్లాడి వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. 2004లో తాను యువజన శాఖ మంత్రిగా, సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ గురుకుల పాఠశాలను సిద్దిపేటకు తీసుకొచ్చామని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రూ.14 కోట్లతో పక్కా భవనం నిర్మించి అందించామని తెలిపారు. ఈ గురుకులం నుంచి ఇంజనీర్లు, డాక్టర్లు తయారవుతున్నందుకు గర్వంగా ఉందన్నారు. గతంలో గురుకులాలకు కాస్మోటిక్ చార్జీలు ఉండేవి కాదని, వాటిని ప్రవేశ పెట్టింది తానేనని పేర్కొన్నారు. తెలంగాణకు ముందు ఒకటి రెండు మెడికల్ కాలేజీలే ఉండేవని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత 34 జిల్లాలకు 34 మెడికల్ కాలేజీలను మంజూరు చేశామని తెలిపారు. 2850గా ఉన్న ఎంబిబిఎస్ సీట్లను 10 వేల వరకు పెంచుకున్నామని అన్నారు. గురుకులాల్లో ఔట్సోర్సింగ్ సిబ్బంది, లెక్చరర్ల సమస్యలపై పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. గురుకులంలోని విద్యార్థులు చల్లనీళ్లతో స్నానం చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, వారి కోసం తన సొంత నిధులతో వాటర్ హీటర్లు, లైబ్రరీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గురుకుల పాఠశాలపై తనకు ప్రత్యేకమైన ప్రేమ ఉందని చెప్పారు.


ఎస్ఐఆర్ అమలులో స్పష్టమైన పురోగతి సాధించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 6: ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) సన్నాహక ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉన్నందున ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా తుది ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని అన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఎస్.ఐ.ఆర్ అమలు తీరు, ముసాయిదా ఓటరు జాబితాపై కలెక్టర్ మంగళవారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఏ.ఈ.ఆర్.ఓలు, బీ.ఎల్.ఓ సూపర్వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా ఎస్.ఐ.ఆర్ అమలును పరిశీలిస్తూ, పనితీరులో వెనుకంజలో ఉన్న ఏ.ఈ.ఆర్.ఓలు, బీ.ఎల్.ఓ సూపర్వైజర్లను కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, అర్బన్ సెగ్మెంట్ పరిధిలోని 301 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్.ఐ.ఆర్ అమలులో స్పష్టమైన ప్రగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎస్.ఐ.ఆర్ సన్నాహక అమలులో అర్బన్ సెగ్మెంట్ వెనుకంజలో ఉందని, ఈ పరిస్థితిలో మార్పు తేవాలన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా బీఎల్ఓలతో మ్యాపింగ్ ను పక్కాగా జరిపించాలని, అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా నిశిత పరిశీలన జరపాలని ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియ అమలులో పురోగతిపై తాను వారాంతంలో మళ్ళీ సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఎలాంటి తప్పిదాలు ఉండకూడదని, ఒత్తిళ్ళు, ప్రలోభాలకు లొంగకుండా పూర్తి పారదర్శకంగా జాబితా ఉండాలన్నారు. ఓటరు జాబితాపై ఏవైనా ఫిర్యాదులు వస్తే సంబంధిత బీ.ఎల్.ఓలు, సూపర్వైజర్లను బాధ్యులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఓటరు జాబితాను ఏ.ఈ.ఆర్.ఓలు, ఈ.ఆర్.ఓలు కనీసం 5 శాతం మేరకైనా ర్యాండమ్ గా చెక్ చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జాబితాలో బోగస్ ఓటర్లు ఉండరాదని, అదే సమయంలో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి తప్పిపోకూడదని అన్నారు. కొత్తగా విలీనం అయిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ, క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన జరపాలని కలెక్టర్ హితవు పలికారు. సవాలుతో కూడుకుని ఉండే ఎన్నికల విధులను ఎంతో అప్రమత్తతో నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, అధికారులు పాల్గొన్నారు.

“



కాలుష్య నివారణలో ధనవంతులూ త్యాగాలు చేయాలి. కార్లు స్టేటస్ సింబల్‌గా మారాయి. సైకిళ్లు మానేసి కార్లు కొనడానికి డబ్బు ఆదా చేస్తున్నారు. ధనవంతులు కార్లు కొనడం మానేస్తే కాలుష్యం తగ్గుతుంది. హై ఎండ్ కార్లకు బదులు ఈవీలను వాడొచ్చు. టోల్ ప్లాజాల మూసివేతకు రెండు నెలల సమయం కావాలనడం అసమంజసం.

- సుప్రీం కోర్టు

ప్రాంతీయం

చైనా మంజా పూర్తిగా నిషేధం

- విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు
- జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు



ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 6: మెదక్ జిల్లా పరిధిలో చైనా మంజాను పూర్తిగా నిషేధించినట్లు జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు, మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చైనా మంజాపై నిషేధం విధించిన నేపథ్యంలో, నిబంధనలకు విరుద్ధంగా చైనా మంజాను విక్రయించినా, వినియోగించినా లేదా దాని వల్ల ఎవరికైనా ప్రమాదం సంభవించినట్లయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాబోయే సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని, సీసీఎస్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేస్తారని పేర్కొన్నారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారయ్యే చైనా మంజా పర్యావరణానికి తీవ్ర హాని కలిగించడంతో పాటు, సాధారణ ప్రజలు, వాహనదారులు మరియు పక్షులకు ప్రాణాపాయం కలిగించే అవకాశం ఉందన్నారు.చైనా మంజాతో గాలిపటాలు ఎగురవేసే సమయంలో గతంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు సైతం తీవ్రంగా గాయపడిన ఘటనలు ఉన్నాయని ఈ కారణాల వల్లనే చైనా మంజాపై పూర్తిస్థాయి నిషేధం విధించబడిందని ఎస్పీ వివరించారు. జిల్లా పరిధిలో ఎక్కడా చైనా మంజా విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజలు చైనా మంజాను ఉపయోగించకుండా, ఎవరికీ హాని కలగని సాధారణ దారాలతో గాలిపటాలు ఎగురవేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఎవరైనా చైనా మంజా విక్రయిస్తున్నట్లు లేదా వినియోగిస్తున్నట్లు గమనించినట్లయితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు గట్ల మల్యాల విద్యార్థి



ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 6: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బానోతు ఈశ్వరి జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయింది. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు దర్శనాల రాజ్ కుమార్ వద్ద సాఫ్ట్ బాల్ క్రీడలో మెళకువలు నేర్చుకున్న ఈశ్వరి పాఠశాల,మండల జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. తొమ్మిదవ తరగతి చదువుతున్న ఈశ్వరికి క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని గుర్తించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మదాసు రమేశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు దర్శనాల రాజ్ కుమార్ తో పాటు, ఇతర ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. సాఫ్ట్ బాల్ క్రీడలో శిక్షణ పొందిన ఈశ్వరి నవంబర్ నెలలో జరిగిన పాఠశాల, మండల స్థాయి సాఫ్ట్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. డిసెంబర్ లో జరిగిన జిల్లా, జోనల్ స్థాయి టోర్నమెంట్లలోను మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. డిసెంబర్ 24 వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మనోహరాబాద్ లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. దీంతో సెలెక్టర్లు బానోతు ఈశ్వరిని జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు హర్యానాలో జరిగే సబ్ జూనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో ఈశ్వరి పాల్గొంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాదాసు రమేశ్ తెలిపారు. జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన ఈశ్వరితో పాటు, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు దర్శనాల రాజ్ కుమార్ ను గట్లమల్యాల సర్పంచ్ ఇంగ నరేశ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సరోజని, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

తండ్రిని హత్య చేసిన కొడుకు



ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 6: తండ్రిని ఓ కొడుకు హత్య చేసిన సంఘటన మెదక్ జిల్లా పాపన్న పేట్ మండల పరిధిలోని సీతానగర్ గ్రామంలో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లంగాడి లక్ష్మయ్య(48) వ్యవసాయంతో పాటు ఓ లైన్ మెన్ వద్ద విద్యుత్ పనుల కోసం ప్రైవేటు సహాయకుడిగా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య శేఖమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.పెద్ద కొడుకు శ్రీకాంత్ వివాహానికి, వ్యవసాయానికి కొంత అప్పులు అయ్యాయి.పెద్ద కొడుకు శ్రీకాంత్ కు, లక్ష్మయ్యకు తరచూ డబ్బుల కోసం గొడవ జరిగేది.డబ్బులు ఇవ్వకపోతే చంపుతా అంటూ తరచూ శ్రీకాంత్ తండ్రిని బెదిరించేవాడు.సోమవారం రాత్రి లక్ష్మయ్య ఇంటికి రాగానే శ్రీకాంత్ మళ్లీ డబ్బులు అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది.శ్రీకాంత్ ఆవేశంలో ముందుగా సుత్తేతో తండ్రిపై దాడి చేయగా తల్లి శేఖమ్మ అతని వద్ద నుంచి సుత్తిని లాక్కోవడంతో శ్రీకాంత్ మళ్లీ అక్కడే ఉన్న కర్రతో లక్ష్మయ్య తలపై దాడి చేయడంతో తీవ్ర గాయమైంది.వెంటనే కుటుంబీకులు మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు.తన భర్త మృతికి కారణమైన కొడుకు శ్రీకాంత్ పై చర్యలు తీసుకోవాలని లక్ష్మయ్య భార్య శేఖమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



గాజులపల్లి లో అంగన్వాడి కేంద్రాల పర్యవేక్షణ కమిటీ ఎన్నిక

ప్రతిపక్షం,దౌల్తాబాద్, జనవరి 6: అంగన్వాడి కేంద్రాల్లో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని,అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని గ్రామ సర్పంచ్ పదస్వామి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజుల పల్లిలో అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు గర్భిణీ స్త్రీలకు అందించే సేవలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా (ఏఎన్ఎంఎస్సి) అంగన్వాడి స్థాయి పర్యవేక్షణ సహాయకమిటిని ఎన్నుకున్నారు. కమిటీ చైర్ పర్సన్ గా సర్పంచ్ పంజ స్వామిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గొల్లపల్లి ప్రేమ్ కుమార్, బోయిని ప్రమీల, పూసపల్లి కుమార్, జనగామ రజిత, అంగన్వాడి టీచర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ కార్యకర్త మురళి స్వామి మృతి

- అంతిమ యాత్రలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు

ప్రతిపక్షం, మిడిదొడ్డి, జనవరి 6: అక్బర్‌పేటభూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త ఊస మురళి స్వామి అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. మంగళవారం ఆయన అంతిమయాత్ర నిర్వహించారు. విషయం తెలుసుకున్న మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు గ్రామానికి చేరుకుని మురళి స్వామి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాజపా కార్యకర్తలు బిక్షపతి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





గ్రామాలను ముత్యాల్లా తీర్చిదిద్దింది కేసీఆర్ ప్రభుత్వమే

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు
- సిద్దిపేటలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఆత్మీయ సత్కారం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 6: సర్పంచ్ ఎన్నికలు గెలవడం పెద్ద ఛాలెంజ్ అని, ప్రజల నమ్మకం పొందిన వారినే ప్రజలు గెలిపించారని ఆయన అన్నారు. కేసీఆర్ హయాంలో గ్రామాలను ముత్యాల్లా తీర్చిదిద్దామని, దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రతి గ్రామానికి ట్రాక్టర్, డంప్ యార్డ్, వైకుంఠ ధామం ఏర్పాటు చేశామని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గ్రామాలు మురికి కుపాలుగా మారాయని విమర్శించారు.సిద్దిపేట జిల్లా సిద్దిపేట పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో నూతనంగా ఎన్నికైన సిద్దిపేట నియోజకవర్గ సర్పంచులు, ఉప సర్పంచులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ... సర్పంచ్ ఎన్నికలు గెలవడం ఎంతో ఛాలెంజ్‌తో కూడిన విషయమని, ప్రజల నమ్మకం పొందిన వారినే ప్రజలు గెలిపించారని అన్నారు. సర్పంచులకు తన సర్వశక్తులు ఉపయోగించి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కేసీఆర్ హయాంలో గ్రామాలను ముత్యాల్లా తీర్చిదిద్దామని, దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రతి గ్రామానికి ట్రాక్టర్, డంప్ యార్డ్, వైకుంఠ ధామం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా గ్రామాలను మురికి కుపాలుగా మార్చిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో దేశవ్యాప్తంగా అవార్డులు ప్రకటిస్తే తెలంగాణ పేరు తప్పనిసరిగా ఉండేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అవార్డుల పేరే కనిపించకుండా పోయిందని అన్నారు. గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో పేరుకుపోయిన చెత్తను తొలగించే బాధ్యత ఇప్పుడు సర్పంచులపై పడిందని తెలిపారు. కేసీఆర్ పాలనలో గ్రామాలకు ప్రతి నెల నిధులు విడుదలయ్యేవని, ప్రస్తుతం కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్రామాలకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ...సర్పంచులను సన్మానించుకోవడం అంటే ప్రజాస్వామ్య పునాది రాళ్లను గౌరవించినట్లేనని అన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల్లో ఓడిన తర్వాత అనేక అవరోధాలు ఎదుర్కొందని, అయినా గులాబీ జెండా గ్రామ స్థాయిలో ఎంత బలంగా ఉందో సర్పంచ్ ఎన్నికల ఫలితాలు నిరూపించాయని పేర్కొన్నారు. పదవి అంటే అధికారం కాదని, అది ఒక గొప్ప బాధ్యత అని అన్నారు. నేటి రాష్ట్ర పరిస్థితి ఇంటి దీపం ఇంటినే కాల్చినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రజలు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆశలు వదులుకున్నారని, మళ్లీ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వమే రానుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ దక్షిణాదిలో పట్టు సాధించాలని చూస్తున్నా అది సాధ్యపడదని అన్నారు.



మైనారిటీల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 6: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మైనారిటీ వర్గాల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకొని పని చేస్తోందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు వహీద్ ఖాన్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వహీద్ ఖాన్ మాట్లాడుతూ... రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం రెండు కీలక పథకాలను ప్రారంభించిందన్నారు. అందులో భాగంగా ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, అవివాహిత మహిళలు తమ స్వంత వ్యాపారాలు ప్రారంభించుకునేందుకు రూ.50,000 ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు.అలాగే ఫకీర్, దూదేకుల వర్గాలకు జీవనోపాధి కల్పన లక్ష్యంగా మోపెడ్ వాహనాల కొనుగోలుకు రూ.1 లక్ష వరకు సబ్సిడీ ఇవ్వనున్నట్లు వివరించారు.



10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 6: జిల్లాలో పదో తరగతి ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణబద్ధంగా విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో గత సంవత్సరం ఫలితాలు, ఈ ఏడాది తీసుకుంటున్న చర్యలను ఆమె సమీక్షించారు. రేపటి నుంచే ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి బలహీన సబ్జెక్టులపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. విద్యార్థులకు బట్టీ కాకుండా అర్థమయ్యేలా బోధన చేయాలని, పరీక్షల ఒత్తిడి లేకుండా స్ట్రెస్ మేనేజ్‌మెంట్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి నిత్యం పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు, హాస్టల్ అధికారులతో సమన్వయం చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక అభ్యసన ప్రణాళిక బుక్లెట్లను ఆవిష్కరించగా, చెకుమకీ సైన్స్ సంబరాలు 2025లో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి సాధించిన ఇందిరా నగర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, ఎంఈఓలు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఘనంగా పద్మదేవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

- జనహృదయనేతకు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 6: తెలంగాణ తొలి మాజీ డిప్యూటీ స్పీకర్ టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఏం పద్మ దేవేందర్ రెడ్డి 57 వ జన్మదిన వేడుకలు హైదరాబాద్ వారి నివాసం కొంపల్లిలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు,కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కొంపల్లిలోని నివాసంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల. మల్లికార్జున్ గౌడ్,పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,మాజీ కౌన్సిలర్లు నాయకుల ఆధ్వర్యంలో పద్మ దేవేందర్ రెడ్డి చేత కేక్ కట్ చేయించారు, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె.జితేందర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ పుట్టి. విజయలక్ష్మి యాదగిరి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ బాదే. చంద్రం,పట్టణ నాయకులతో కలిసి గజమాలతో ఘనంగా సన్మానించి కేక చేయించారు. అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలు అందరు కలసి కేక్ ను ఒకరికొకరు తినిపించుకొని స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ.. పద్మదేవేందర్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ఎల్లప్పుడూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థించారు. అదేవిధంగా జిల్లాలోని వివిధ మండల కేంద్రాల్లో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు,కార్యకర్తలు కేకులు కట్ చేసి పద్మ దేవేందర్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీకౌన్సిలర్ లు జయరాజ్, కిషోర్,ఆర్కే శ్రీనివాస్, మాయ. మల్లేశం,జెల్ల గాయత్రి, సోహెల్, పట్టణ పార్టీ కోకన్వీనర్లు లింగారెడ్డి, జుబెర్ అహ్మద్, కండెల. సాయిలు నాయకులు ప్రభు రెడ్డి, ఏనుగుల. రాజు,శంకర్,నగేష్, మధు, రుక్మా చారి, ఫాజిల్,గోపాల్, సంతోష్, శ్రీనివాస్ గౌడ్,శ్రీను నాయక్ స్వామి నాయక్,మోహన్ నాయక్, ఎంబిపూర్ మహేష్, రంజిత్, కిరణ్,చంద్ పాషా భువన్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ అభివృద్ధి మైనంపల్లి రోహిత్ ఏకైక లక్ష్యం



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 6: మెదక్ పట్టణం మున్సిపల్ గా ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు భారీగా నిధులు వచ్చి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అని 80 కోట్ల 24 లక్షల రూపాయలతో మెదక్ పట్టణాన్ని అభివృద్ధి పరచడం కోసం ప్రత్యేక నిధులు తీసుకురావడం జరిగిందని మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రావు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్ రావు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని అన్నారు. మెదక్ పట్టణ అభివృద్ధికై ప్రభుత్వం విడుదల చేసిన నిధులకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హనుమంతరావుకు మెదక్ పట్టణ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసినప్పటికి రేవంత్ రెడ్డి తన నాయకత్వంలో అభివృద్ధి వైపు పయనించే విధంగా ముందుకు తీసుకుని వెళ్తున్నారని అన్నారు. మెదక్ ను సుందర నందన వనంగా తీర్చిదిద్దడమే ఎమ్మెల్యే గొప్ప సంకల్పంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేకు ఒక విజన్ ఉన్నదని ఆ విజన్ మెదక్ పట్టణం అభివృద్ధికి నాంది అని వారు తెలిపారు. గతంలో ఏడుపాయల, చర్చ్ అభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించి, పనులు కూడా కొనసాగుతున్నాయని అన్నారు. మెదక్ మున్సిపల్ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు ఇంత పెద్ద నిధులు రావడం మొదటి సారి అది యువ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ గొప్పతనం అన్నారు. ఈ మీడియా సమావేశంలో మెదక్ మాజీమున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్. మాజీ కౌన్సిలర్లు ముత్యం గౌడ్. వసంత్ రాజ్. గోధుల కృష్ణా మున్నా. ఆంజనేయులు గౌడ్, బొజ్జ పవన్, దయాసాగర్, చింతల శ్రీను, ప్రవీణ్, స్వరూప, ఉమర్, అమీర్, రమేష్, దేవుల, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



టెస్టుల్లో జో రూట్ కొత్త శిఖరాలను చేరుకుంటున్నాడు. కానీ విరాట్ టెస్టులకు వదిలేశాడు. రిటైర్మెంట్ కు ముందు అతడు ఇబ్బందులు పడటం నిజమే. కానీ ఎందుకు విఫలమవుతున్నాడనేది మనసుపెట్టి ఆలోచించడం లేదు. టాప్ ఆర్డర్ బ్యాటర్ కు ఈజీ ఫార్మాట్‌అయిన వన్డేలను ఎంచుకోవడం నిరాశకు గురిచేసింది.

- సంజయ్ మంజ్రేకర్, క్రికెట్ కామెంటేటర్.



'సర్' ఎఫెక్ట్.. యూపీలో 2 కోట్లకు పైగా ఓట్ల తొలగింపు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 6: ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం పలు రాష్ట్రాల్లో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) చేపట్టిన సంగతి తెలిసిందే. దీని ద్వారా అక్రమ ఓట్లను తొలగిస్తున్నారు. తాజాగా యూపీలో చేపట్టిన సర్ నివేదిక ఆధారంగా ఓటర్ల జాబితాపై ముసాయిదాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. దీని ప్రకారం యూపీలో 2.89 కోట్ల ఓట్లను తొలగించారు. వీరిలో 46 లక్షల ఓట్లు మరణించినవారివి. మిగిలిన ఓట్లలో 2.17 కోట్ల మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. అలాగే 25.47 లక్షల మంది డూప్లికేట్ ఓట్లు కలిగి ఉన్నారు. యూపీలో తాజా జాబితా ప్రకారం.. 15,000 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నారు. తాజా జాబితాకు సంబంధించి అభ్యంతరాలున్నా.. తమ పేర్లు లిస్టులో లేకున్నా ఫిబ్రవరి 6 వరకు ఫిర్యాదుచేయవచ్చు. ఫాం 7, 8లలో స్థానిక అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదులు, పరిశీలన అనంతరం తుది జాబితాను మార్చి 6న విడుదల చేసే అవకాశం ఉంది. ఈ అంశాల్ని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి నవదీప్ రిన్వా మంగళవారం వెల్లడించారు. ఈ జాబితాను రాష్ట్రంలోని పార్టీలకు పంపించనున్నట్లు ఆయన తెలిపారు. యూపీలో గతంలో 15.44 కోట్ల ఓట్లు ఉండగా.. తాజా ముసాయిదా ప్రకారం.. 12.56 కోట్ల మంది ఓటర్లు మాత్రమే ఉంటారు. అంటే దాదాపు 18.7 శాతం ఓట్లను తొలగించినట్లైంది. ఇంతకుముందు సర్ ఆధారంగా తమిళనాడులో 15 శాతం, గుజరాత్ లో 14.5 శాతం ఓట్లను ఎన్నికల సంఘం తొలగించింది. కేంద్ర ఎన్నికల సంఘం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో గత ఏడాది సర్ నిర్వహించింది. ఇక.. యూపీలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. మరోవైపు సర్ పై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. దొంగ ఓట్లను తొలగించే పేరుతో.. ఇండియా కూటమి గెలిచిని నియోజకవర్గాల్లోనే ఓట్లను ఎక్కువగా తొలగిస్తున్నట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

విశ్వ వీక్షణం



నేపాల్‌లో మత ఘర్షణలు.. బార్డర్ మూసివేత

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 6: భారత సరిహద్దు దేశమైన నేపాల్ లో మత ఘర్షణలు చెలరేగుతున్నాయి. దీంతో ఆ ఘర్షణ ప్రభావం ఇండియాపై పడకుండా భారత ప్రభుత్వం ఇరు దేశాల సరిహద్దును మూసివేసింది. భద్రతా కారణాల రీత్యా, ముందస్తుగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నేపాల్ లోని పార్సా జిల్లా, బిర్గంజ్ పట్టణంలో నిరసనలు ఆందోళనకరంగా మారుతున్నాయి. ఇటీవల నేపాల్ లోని ధనుషా జిల్లా, కమలా మున్సిపాలిటీకి చెందిన హైదర్ అన్సారీ, అమానత్ అన్సారీ అనే ఇద్దరు ముస్లింలు సోషల్ మీడియాలో ఒక మతాన్ని కించపరుస్తూ, రెచ్చగొట్టేలా వీడియో విడుదల చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో ఆ మతానికి చెందిన వారు ఆందోళన చేపట్టారు. దీంతో ధనుషా, పార్సా జిల్లాలో ఆందోళనలు పెరిగాయి. స్థానికులు ఆ ఇద్దరినీ పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇదే సమయంలో కొందరు కమలా ప్రాంతాంలోని ఒక మసీదును ధ్వంసం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో కొందరు పోలీసు స్టేషనుపై కూడా దాడి చేసి, రాళ్లు విసిరారు. ఈ దాడుల్ని అణిచివేయడానికి పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. నేపాల్ లోని హిందువులు ఈ ఘర్షణల్లో అధికంగా పాల్గొంటున్నారు. తమ దేవతల్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేస్తున్నారు. ప్రస్తుతం పార్సా జిల్లాలోని బిర్గంజ్ ప్రాంతంలో ఆందోళనలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో అధికారులు అక్కడ కర్ఫ్యూ విధించారు. ఈ ప్రాంతం బిహార్ లోని రాక్సాల్ జిల్లాకు దగ్గరగా ఉంటుంది. అందువల్ల అక్కడి ప్రభావం మనపై పడకుండా అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. నేపాల్‌భారత్ సరిహద్దుల్ని పూర్తిగా మూసేసి, రాకపోకల్ని నిషేధించారు. అత్యవసర సేవల్ని కూడా నిలిపివేశారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మరోవైపు ఘర్షణల నేపథ్యంలో అక్కడ ఉంటున్న భారతీయులు ఎక్కువగా తిరిగి ఇండియా వచ్చేస్తున్నారు.



కార్బోహైడ్రేట్స్

మధుమేహం ఉన్నవారికీ అవసరమే

మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సరైన ఆహారాన్ని ఎన్నుకోవడంలో తరచుగా గందరగోళానికి గురవుతుంటారు. అదేవిధంగా, జీవక్రియ రుగ్మతలు ఉన్నవారు వారి ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అయితే మధుమేహంఉన్నవారు కార్బోహైడ్రేట్స్ కి దూరంగా ఉండాలని అంటుంటారు. అయితే షుగర్ ఉన్నవారికి కూడా తగిన మోతాదులో కార్బోహైడ్రేట్స్ అవసరమే. కార్బోహైడ్రేట్ ఆహారాలను ఎంచుకోవడం విషయానికి వస్తే, మధుమేహ వ్యాధిగ్రస్తులు గందరగోళానికి గురవుతారు. ఎందుకంటే అవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. మధుమేహం ఉన్నవారు భోజనానికి 4560 గ్రాముల కార్బోహైడ్రేట్లు, చిరుతిండికి 15 20 గ్రాములు తినాలని ఆరోగ్య నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. మీ రోజువారి దినచర్యతో పాటు వాడే మందుల ఆధారంగా పై లెక్కలు మారవచ్చు. అయితే మధుమేహం (షుగర్) ఉన్నవారు తమ శరీరంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచే కొన్ని కార్బోహైడ్రేట్ ఆహారాలను చూద్దాం.

చక్కెర దుంప

ఇవి సహజంగా రుచికరంగా కూడా ఉంటాయి. ఇది ఫైబర్ మరియు అవసరమైన విటమిన్లతో నిండి ఉంటుంది. షుగర్ బీట్ జీర్ణక్రియలో సహాయపడుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఆ స్పైక్‌ల గురించి చింతించకుండా ఆరోగ్యకరమైన పిండి పదార్థాలను పొందడానికి ఇది ఒక గొప్ప మార్గం.

పప్పులు

మధుమేహం ఉన్నవారు కార్బోహైడ్రేట్లను పొందడానికి మరొక ఆరోగ్యకరమైన మార్గం చిక్కుళ్ళు. దీని కోసం, కాయధాన్యాలు మరియు చిక్‌పీస్ ముఖ్యంగా రోజువారీ భోజనానికి మంచి ఎంపికలు. వాటిలో ప్రోటీన్ మరియు ఆరోగ్యకరమైన కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి అవి రక్తంలో చక్కెరను అదుపులో ఉంచుతాయి.


పాస్తా

ఒక్కోసారి పాస్తా రుచి చూస్తే పెద్దగా నష్టం ఉండదు. మీరు పాస్తాను ఇష్టపడితే,
మీరు ధాన్యపు పాస్తాను తినవచ్చు. ఇది సాపేక్షంగా తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుంది మరియు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది.



క్వినోవా

క్వినోవా పూర్తి ప్రోటీన్‌తో కూడిన బహుముఖ ధాన్యం. ఇది ఫైబర్, ఫోలేట్ , ఐరన్, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు,



ఫాస్ఫరస్, జింక్ మొదలైన అనేక ముఖ్యమైన పోషకాల యొక్క పవర్‌హౌస్. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది మరియు మిమ్మల్ని ఉత్సాహంగా మరియు సంతృప్తిగా ఉంచుతుంది.



చింతపండుతో ఆరోగ్యం

మన వంటలలో చింతపండు అంతర్భాగం. ఈ చింతపండు లేకుండా దాదాపు ఏ ఆహారమూ రుచికరంగా ఉండదు. వంటలో అనివార్యమైన అంశంగా మారిన చింతపండు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుందని మీకు తెలుసా..? ముఖ్యంగా జీర్ణక్రియను ఉత్తేజపరిచి, కొలెస్ట్రాల్ ను నియంత్రించడంలో చింతపండు ముఖ్యపాత్ర పోషిస్తుందని వైద్యులు చెబుతున్నారు. చింతపండులో దాగి ఉన్న ఔషధ గుణాల గురించి తెలుసుకోవాలి. చింతపండులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్, కెరోటిన్లు, విటమిన్ బి కాంప్లెక్స్ ఉన్నాయి. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి, బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. పొటాషియం పుష్కలంగా ఉన్న చింతపండు హృదయ స్పందన రేటును నియంత్రించడానికి, ద్రవాలను సమతుల్యం చేయడానికి ఉపయోగపడుతుంది. చింతపండులో ఫ్లేవనాయిడ్స్ వంటి పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతాయి. ఇందులో మెగ్నీషియం కూడా ఎక్కువగా ఉంటుంది, ఇది రక్తపోటును నిర్వహించడానికి సహాయపడుతుంది. ఆహారంలో చేర్చినప్పుడు, చింతపండు యాంటీ ఫంగల్ చర్యను పెంచుతుంది. చింతపండు టానిక్, క్లీనింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇది ప్రేగులు, ఇతర జీర్ణ అవయవాల సరైన దిశలో పనిచేసేలా చేస్తుంది. చట్నీల నుండి కూరల వరకు, చింతపండు ఆహారానికి రుచిని జోడిస్తుంది. అంతే కాకుండా ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.



ఢిల్లీ కాలుష్యానికి కారణాలు గుర్తించండి

- ప్రభుత్వానికి సుప్రీం సూచన

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 6: ఢిల్లీలో పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వాయు కాలుష్యాన్ని నియంత్రించాలంటే ముందుగా.. కాలుష్యానికి గల కారణాలు గుర్తించాలని సూచించింది. ఈ మేరకు వాయు కాలుష్యంపై ఏర్పాటైన క్యామ్ (కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్)కు ఆదేశాలు జారీ చేసింది. వాయు కాలుష్యానికి పరిష్కారాలు వెతకడానికి ముందు.. కారణాలు కనుగొనడంపై దృష్టి పెట్టాలని సూచించింది. ఢిల్లీలో వాయు కాలుష్యంపై దాఖలైన పలు పిటిషన్లపై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సమస్యకు మూలాలు, కారణాలు కనుక్కోకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నా లాభం లేదని అభిప్రాయపడింది. రెండు వారాల్లోగా వివిధ రంగ నిపుణులను గుర్తించి, వారితో చర్చించి, ఢిల్లీ వాయు కాలుష్యానికి గల కారణాలు తెలుసుకోవాలని ఆదేశించింది. వివిధ రంగాలకు చెందిన నిపుణుల్ని గుర్తించి, అందరినీ ఒకే తాటిపైకి తీసుకురావడం, సరైన వివరాలు నమోదు చేయడం క్యామ్ బాధ్యత అని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాల్ని ప్రజలకు అందుబాటులో ఉంచి, జవాబుదారీతనాన్ని పాటించాలని సూచించింది. వాయు కాలుష్యంపై కోర్టుకు పూర్తి అవగాహన లేకపోవచ్చని, అయితే, నిపుణుల ద్వారా సరైన నిర్ణయం తీసుకునేలా చూస్తామని తెలిపింది. సమస్యలు గుర్తిస్తే, పరిష్కారం అదే లభిస్తుందని కోర్టు అభిప్రాయపడింది.

సోనియాగాంధీకి అస్వస్థత

- ఢిల్లీ కాలుష్య ప్రభావమే కారణమన్న వైద్యులు!

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 6: కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో సోమవారం రాత్రి ఢిల్లీలోని గంగారామ్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, చికిత్సకు స్పందిస్తున్నారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. 79ఏళ్ల సోనియాకు దీర్ఘకాలిక దగ్గు సమస్య ఉండడంతో పాటు ఢిల్లీలో ఉన్న వాయు కాలుష్య పరిస్థితుల నేపథ్యంలో తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇప్పుడు చలి తీవ్రత కూడా తోడవడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఒక్కసారిగా తిరగబెట్టాయని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఛాతీ వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉన్నారని, ఆందోళన అవసరంలేదని ఆస్పత్రి చైర్మన్ చెప్పారు.



కాగ్రెస్ నేత సురేశ్‌కల్మాడీ కన్నుమూత

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 6: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సురేశ్ కల్మాడీ(81) కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. పుణెలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 3.30గంటలకు చనిపోయారు. సురేశ్ కల్మాడీ పీవీ ప్రభుత్వంలో రైల్వే శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 19962011 మధ్యలో భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా, ఆ తర్వాత కామన్వెల్త్ క్రీడల నిర్వాహక కమిటీ చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. కల్మాడీ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే భారత్‌లో ప్రతిష్ఠాత్మక ఆఫ్రో ఆసియా గేమ్స్(2003), కామన్వెల్త్ యూత్ గేమ్స్(2008), కామన్వెల్త్ గేమ్స్(2010), ఆసియాన్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలను(1989,2013) నిర్వహించారు. ఆ సమయంలోనే కామన్వెల్త్ క్రీడల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలొచ్చాయి. కల్మాడీని అరెస్టు కూడా చేశారు. అయితే, తర్వాత ఈడీ ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చింది. కల్మాడీ అంతకుముందు 19641972మధ్యలో వాయుసేనలో పైలట్‌గా పనిచేశారు. కల్మాడీ 1944లో మద్రాసులో జన్మించారు. 1980ల్లో రాజకీయాల్లోకి వచ్చారు. 4సార్లు రాజ్యసభకు, 3సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారను.







ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu



నిప్పులు చెరిగిన సిరాజ్..

- బెంగాల్‌పై హైదరాబాద్ విజయం

విజయ్ హజారే ట్రోఫీ 202526లో భాగంగా మంగళవారం బెంగాల్ తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ విజయం సాధించింది. అమన్ రావు అద్భుతమైన డబుల్ సెంచరీ, హైదరాబాదీ స్పీడ్ స్టర్ మహమ్మద్ సిరాజ్ సూపర్ బౌలింగ్తో హైదరాబాద్ అపూర్వ విజయం అందుకుంది. మంగళవారం రాజ్‌కోట్ వేదికగా బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో 107 పరుగుల తేడాతో హైదరాబాద్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. అనంతరం 353 పరుగుల భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన బెంగాల్ జట్టు 44.4ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. త్వరలో జరగనున్న న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు సన్నాహకంగా ఈ టోర్నీ ఆడుతున్న మహమ్మద్ సిరాజ్ ఈ మ్యాచ్‌లో నిప్పులు చెరిగాడు. సిరాజ్ తన 10 ఓవర్ల కోటాలో 58 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. సిరాజ్ దెబ్బకు బెంగాల్ బ్యాటర్లు విలవిల్లాడారు. సిరాజ్ తో పాటు నితీష్ రెడ్డి రెండు, సీవీ మిలింద్, రక్షణ్, నితిన్ తలా వికెట్ పడగొట్టారు. ఇక బెంగాల్ బ్యాటర్లలో షహబాజ్ అహ్మద్ ఒంటరి పోరాటం చేశాడు. అతను 113 బంతుల్లో 108 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇక తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ లో జట్టులో యువ ఓపెనర్ అమన్ రావు అద్భుతమైన డబుల్ సెంచరీతో చెలరేగాడు. కేవలం 154 బంతుల్లో 200 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. లిస్ట్ఏ మ్యాచుల్లో అతడికి ఇదే తొలి శతకం కావడం గమన్హారం. కాగా హైదరాబాద్ ప్రస్తుతం గ్రూపుబి పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది. ఈ జట్టుకు ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి.

స్మిత్, హెడ్ సెంచరీలు


- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 518/7

ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య యాషెస్ సిరీస్ ఐదో టెస్టులో పరుగుల వరద పారుతున్నది. సిరీస్‌ను ఇప్పటికే దక్కించుకున్న ఆసీస్..ఇంగ్లండ్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తున్నది. కెప్టెన్ స్టీవ్‌స్మిత్ (129నాటౌట్), ట్రావిస్ హెడ్ (163) సెంచరీలతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 518 పరుగులు చేసింది. స్మిత్‌తో పాటు బ్యూ వెబ్‌స్టర్ (42 నాటౌట్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 166/2తో ఆట కొనసాగించిన కంగారూలు..ఇంగ్లండ్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా సిరీస్‌లో మంచి ఫామ్‌మీదున్న హెడ్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా బౌండరీలతో దుమ్మురేపాడు. క్రీజులో ఉన్నంత సేపు ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపెట్టిన హెడ్..కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. హెడ్ ఔట్ తర్వాత ఆ బాధ్యతను భుజానేసుకున్న స్టీవ్ స్మిత్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టు భారీ స్కోరుకు బాటలు వేశాడు. తన కెరీర్‌లో ఆఖరి టెస్టు ఆడుతున్న ఉస్మాన్ ఖవాజా (17), అలెక్స్ క్యారీ (16)నిరాశపరిచినా..కామెరూన్‌గ్రీన్ (37), వెబ్‌స్టర్‌తో కలిసి వరుసగా ఏడు, ఎనిమిదో వికెట్‌కు 71, 81 పరుగుల భాగస్వామ్యాలు నెలకొల్పాడు. చేతిలో మూడు వికెట్లు ఉన్న ఆసీస్ ప్రస్తుతం 134 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది. బ్రైడన్ కార్స్ (3/108), బెన్ స్టోక్స్(2/87) ఆకట్టుకున్నారు.



ఫిబ్రవరి 14 నుంచి ఇండియన్ సూపర్ లీగ్

ఫుట్ బాల్ అభిమానులకు గుడ్‌న్యూస్. 'గోట్ ఇండియా టూర్ ఆఫ్ 2025'లో లియోనల్ మెస్సీ రాకతో పులకించిపోయిన ఫ్యాన్స్‌ను అలరించేందుకు ఇండియన్ సూపర్ లీగ్ 202526 సీజన్ సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 14 నుంచి ఈ మెగా టోర్నీ సందడి షురూ కానుందని బుధవారం అఖిల భారత ఫుట్ బాల్ సమాఖ్య వెల్లడించింది. టైటిల్ కోసం 14 జట్లు పోటీపడుతాయని తెలిపిన ఏఐఎఫ్ఎఫ్ పూర్తి స్థాయి షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేస్తామని చెప్పింది. ఇండియన్ సూపర్ లీగ్ 202526 సీజన్ రౌండ్ రాబిన్ పద్ధతిలో జరుగనుంది. టోర్నీలో పాల్గొనే 14 జట్లను గ్రూప్‌లుగా విభజిస్తారు. లీగ్ దశలో ఒక జట్టు తమ గ్రూప్‌లోని టీమ్‌తో ఒక మ్యాచ్ ఆడనుంది. ఒక్కో గ్రూప్ నుంచి అత్యధిక పాయింట్లు సాధించిన జట్లు ముందంజ వేస్తాయి. అయితే.. ఈ మెగా ఈవెంట్ ఆరంభ తేదీని ప్రకటించిన ఏఐఎఫ్ఎఫ్.. బెంగళూరు, చెన్నాయిన్, ఢిల్లీ, ఈస్ట్ బెంగాల్, గోవా, ఇంటర్ కాశీ, జంషెడ్‌పూర్, కేరళ బ్లాస్టర్స్, మొహమ్మదిన్, మొహూన్ బగన్, ముంబై సిటీ, నార్త్‌ఈస్ట్ యునైటెడ్, ఒడిశా, పంజాబ్ క్లబ్స్‌ను సంప్రదించాక పూర్తి షెడ్యూల్ విడుదల చేస్తామని పేర్కొంది.



అమన్ రావు డబుల్ సెంచరీ

విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాదీ బ్యాటర్ అమన్ రావ్ దుమ్మురేపాడు. డబుల్ సెంచరీతో హడలెత్తించాడు. బెంగాల్‌తో రాజ్‌కోట్‌లో జరిగిన మ్యాచ్‌లో బౌండరీలో మోత మోగించాడు. కేవలం 154 బంతుల్లోనే అతను 200 పరుగులు చేశాడు. అతని డబుల్ సెంచరీలో 12 ఫోర్లు, 13 సిక్సర్లు ఉన్నాయి. అమెరికాలో పుట్టిన హైదరాబాదీ బ్యాటర్ అమన్ రావ్.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు సొంతం చేసుకున్నది. అయితే లిస్ట్ ఏ మ్యాచుల్లో తొలి సారి అతను సెంచరీ చేశాడు. ఇది అతనికి కేవలం మూడో మ్యాచ్ మాత్రమే. షమీ, ఆకాశ్ దీప్, ముఖేశ్ కుమార్ లాంటి బలమైన బౌలర్లు ఉన్న బెంగాల్ జట్టుపై అమన్ రావ్ డబుల్ సెంచరీ కొట్టడం విశేషం. టాస్ గెలిచిన బెంగాల్ జట్టు.. హైదరాబాద్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అయితే ఇన్నింగ్స్ ఆఖరి బంతికి సిక్సర్ కొట్టిన అమన్ రావు.. తన ఖాతాలో డబుల్ సెంచరీ వేసుకున్నాడు. ఆకాశ్ దీప్, షమీ, ముఖేశ్ బౌలింగ్‌లో అతను 120 రన్స్ స్కోరు చేశాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఈ సీజన్‌లో ఇది రెండో డబుల్ సెంచరీ. ఒడిశా బ్యాటర్ స్వస్తిక్ సమల్ కూడా డబుల్ సెంచరీ బాదిన విషయం తెలిసిందే.

'మన శంకర వర ప్రసాద్ గారు' లో వింటేజ్ మెగాస్టార్‌ని చూస్తారు



నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల

మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ 'మన శంకర వర ప్రసాద్ గారు' తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఉత్సాహాన్ని మరింత పెంచుతూ విక్టరీ వెంకటేష్ కీలక పాత్రతో నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రంలో నయనతార కథానాయికగా నటిస్తున్నారు. సినిమా ప్రమోషన్‌లు అద్భుతంగా జరుగుతున్నాయి. ట్రైలర్, పాటలు సినిమా పై అంచనాలను భారీగా పెంచాయి. 'మన శంకర వర ప్రసాద్ గారు' సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా జనవరి 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

సెన్సార్ జరిగింది కదా.. రిపోర్ట్ ఎలా వుంది?

చాలా మంచి రిపోర్ట్ వచ్చింది. సినిమాని చాలా ఎంజాయ్ చేశారు. క్లిన్ ఫిల్మ్. ఫుల్ ఫ్యామిలీ ఫన్. పిల్లలు, ఫ్యామిలీతో కలసి అందరూ చూసే సినిమా అని చెప్పారు.

ఇద్దరు పెద్ద స్టార్స్ కలిసి చేసిన సినిమా కదా.. ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత అభిమానులు నుంచి ఎలాంటి రెస్పాన్స్ వస్తోంది?

ఇద్దరి ఫ్యాన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. సోషల్ మీడియా నుంచి కూడా అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. చిరంజీవి గారు, వెంకటేష్ గారు ఇద్దరూ చాలా హ్యాపీగా కలిసి పని చేశారు.

సుస్మిత గారు. ఇది చాలా పెద్ద ప్రాజెక్ట్ కదా.. ఈ ప్రాసెస్ ని ఎలా ఎంజాయ్ చేశారు?

ఇది మైల్ స్టోన్ ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ చేయడం ఒక గౌరవంగా భావిస్తున్నాము. నాన్నగారి కోర్ జానర్ లో చేయడం, అనిల్ గారు ఆ జానర్ ని తీసుకోవడం సూపర్బ్. సాహు గారితో జర్నీ బ్యూటీఫుల్. ఇది చాలా ఎంజాయ్ చేస్తూ చేసిన మైల్ స్టోన్ ప్రాజెక్ట్. ఈ కాంబినేషన్ మళ్ళీ కంటిన్యూ కావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాతో నాన్న గారు ఒక కొత్త ట్యాలెంట్ బాక్స్ ని ఓపెన్ చేసినట్లుగా అనిపించింది. రౌడీ అల్లుడు సినిమాలో చూసినట్లుగా వుందని ఫ్యాన్స్ అంటున్నారు. వింటేజ్ ఛార్మ్ ని గుర్తు చేస్తునే ఇందులో ఆయన నటన చాలా ఫ్రెష్ గా వుంటుంది.

సాహు గారు.. సంక్రాంతికి చాలా సినిమా వున్నాయి.. థియేటర్స్ ఇబ్బంది ఉంటుందనే మాట వినిపిస్తుంది ?

మాకు రన్నింగ్ డిస్ట్రిబ్యూటర్స్ ఉన్నారు. సంక్రాంతిలో ముందు నుంచి మా సినిమా వుంది. అయితే ఇన్ని సినిమాలు వస్తున్నప్పుడు ఒకటో అర థియేటర్స్ తగ్గడం సహజమే. కాకపోతే మా సినిమా వరకూ థియేటర్స్ సమస్య పెద్దగా లేదు.

సుస్మిత గారు .. వెంకటేష్ గారి పాత్ర ఎలా ఉండబోతోంది?

వెంకటేష్ గారు బిగ్ ఇంపాక్ట్ ఫుల్ క్యారెక్టర్ లో కనిపిస్తారు. ఆయన వచ్చిన తర్వాత ఫన్ మరింత గా రైజ్ అవుతుంది. చాలా ముఖ్యమైన పాత్ర. చాలా ఎంటర్‌టైన్‌మెంట్ వున్న రిచ్ క్యారెక్టర్.

సాహు గారు.. చిరంజీవి గారి పాత్ర ఎలా వుంటుంది ?

ట్రైలర్ చిరంజీవి గారి క్యారెక్టర్ కి సంబంధించి షేడ్స్ చూపించాం. ఆయన క్యారెక్టర్ లో ఫన్ యాక్షన్ ఎమోషన్ అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ వుంటాయి. వెంకటేష్ గారు చిరంజీవి గారి మధ్య చాలా అద్భుతమైన కామెడీ సీన్స్ వుంటాయి. ట్రైలర్ జస్ట్ సాంపిల్ మాత్రమే. ట్రైలర్ లో చిరంజీవి గారు క్యారెక్టర్ ని పరిచయం మాత్రమే చేశాం. సినిమాలో చాలా వుంది. ఈ సినిమా సంక్రాంతి విందు అనేది చిన్న మాట.. సినిమా చూశాను కాబట్టి చెబుతున్నాను. అద్భుతంగా వుంటుంది.

చిరంజీవి గారిని ప్రమోషన్స్ లో ఎప్పటినుంచి చూడబోతున్నాం?

అన్ని ఏరియాల్లో ప్రమోషన్స్ అద్భుతంగా జరుగుతున్నాయి. అనిల్ గారు ఫుల్ స్పీడ్ లో ప్రమోషన్స్ చేస్తున్నారు. చిరంజీవి గారు పోస్ట్ ప్రొడక్షన్, డబ్బింగ్ లో బిజీగా వున్నారు. రేపటి నుంచి ఆయన వర్క్ అయిపోతుంది. ప్రీరిలీజ్ ఈవెంట్ వుంది. చిరంజీవి గారు వెంకటేష్ గారు ఇద్దరూ వస్తున్నారు. ఆ నెక్స్ నుంచి ప్రమోషన్స్ లో ఫుల్ బిజీ అవుతారు. ఇందులో ఒక స్పెషల్ సాంగ్ వుంది. అందులో వింటేజ్ చిరంజీవి గారిని చూస్తారు. నిన్న ఓవర్సిస్ ఆడియన్స్ తో మంచి వీడియో కాల్ కూడా అయ్యింది.

సుస్మిత గారు .. చిరంజీవి గారు ఎందరికో స్ఫూర్తి.. మీరు ఆయన దగ్గర నుంచి ఏం నేర్చుకున్నారు?

నేర్చుకోవాలనే తపన వుంటే ఆయన నుంచి ప్రతిరోజు ఒక పాఠం నేర్చుకోవచ్చు. ఈ సినిమాలో జర్నీ చేస్తున్నప్పుడు ఒక పని మొదలుపెట్టిన తర్వాత దాని కోసం ప్రాణం పెట్టి నిజాయితీగా హార్డ్ వర్క్ చేయాలనేది నేర్చుకున్నాను.

బాబాయ్ గారితో ఎప్పుడు సినిమా చేస్తున్నారు?

ఆ గాడ్ గిఫ్ట్ కోసం ఎదురుచూస్తున్నాను. సినిమా కోసం అడిగాను. లైన్ లో వున్నాను. ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్నాను(నవ్వుతూ)

భీమ్స్ మ్యూజిక్ గురించి?

మ్యూజిక్ అద్భుతంగా చేశారు. పాటలు పెద్ద హిట్ అయ్యాయి. రీరికార్డింగ్ కూడా అదిరిపోతుంది. సమీర్ రెడ్డి గారు అద్భుతమై విజువల్స్ చూపించారు. ఫెంటాస్టిక్ గా వున్నాయి.

ప్రిమియర్స్ గురించి?


టికెట్స్ రేట్స్ క్లారిటీ రాగానే.. ప్రిమియర్స్ గురించి చెప్తాం.

సాహుగారు.. ఇంతకీ జన నాయకుడు.. భగవంత్ కేసరి రీమేకా? కదా?

ట్రైలర్ చూశాకా.. మీకు అర్ధమైవుంటుంది. అది రీమేకే. ట్రైలర్ లో అన్ని చెప్పారు కదా.. సినిమాలో రైట్స్, క్రెడిట్స్ వుంటాయి.

సాహుగారు.. అనిల్ గారి నెక్స్ట్ సినిమా కూడా మీరే చేస్తున్నారా?

అవును. చేస్తున్నాం.



'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' మెల్లిసా పాత్రలో రుక్మిణి వసంత్

రాకింగ్ స్టార్ యష్ సెన్సేషనల్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' సినిమా నుంచి వస్తోన్న క్రేజీ అప్‌డేట్స్‌తో అంచనాలు రోజు రోజుకీ పెరుగుతూ వస్తున్నాయి. తాజాగా ఈ భారీ యాక్షన్ డ్రామాలో రుక్మిణి వసంత్ ను మెలిస్సా పాత్రలో పరిచయం చేస్తూ లుక్ పోస్టర్‌ను మేకర్స్ మంగళవారం రోజున రిలీజ్ చేశారు. పోస్టర్‌ను గమనిస్తుంటే ఆమె అందంగా, అధికారంతో, ఎలాంటి భయం లేకుండా కనిపించనుందనే పాత్రలో కనిపించనుందనే విషయం తెలుస్తోంది. యష్, గీతూ మోహన్ దాస్ కాంబో అనౌన్స్‌మెంట్ రోజు నుంచే అందరిలోనూ ఎగ్జయిట్‌మెంట్‌ను క్రియేట్ చేసింది. ఇప్పుడు యష్‌తో కలిసి రుక్మిణి వసంత్ నటించటంతో ఇదింకా ప్రత్యేకతంగా అనిపిస్తోంది. డైరెక్టర్ గీతు కథలో చెప్పాలనుకున్న డెప్త్, సీరియస్‌నెస్ అర్థం చేసుకుని తనదైన నటనతో భావోద్వేగాలను అద్భుతంగా పలికించేలా సహజంగా ఒదిగిపోయే నటి రుక్మిణి. అలాగే అంతర్జాతీయ స్థాయిలో నిలిచిపోయేలా ఓ ఇండియన్ సినిమా చేయాలనే యష్ ఆశయం కూడా ఇందులో ప్రతిబింబిస్తుంది.



శంబాల యూనిట్‌ని అభినందించిన దిల్ రాజు

డిసెంబర్ 25న రిలీజైన దాదాపు 5 సినిమాల్లో యూనానిమస్ హిట్ టాక్ తెచ్చుకుంది 'శంబాల' సినిమా. బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకోవడమే గాక నిర్మాతలకు లాభాలు తెచ్చిపెట్టి క్రిస్మస్ విన్నర్ గా నిలిచింది. ముఖ్యంగా ఆదికి మాత్రం శంబాల సినిమా మంచి బ్రేక్ ఇచ్చిందనే చెప్పుకోవాలి. యుగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో అర్చన ఐయ్యర్ హీరోయిన్ గా నటించింది. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద ఈ మూవీని మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు సంయుక్తంగా నిర్మించారు. ఈ మూవీకి ప్రవీణ్ కె బంగారి విజువల్స్, శ్రీ చరణ్ పాకాల ఆర్‌ఆర్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. యగంధర్ ముని తెరకెక్కించిన తీరు, కొత్త పాయింట్‌ను టచ్ చేయడం, అన్ని రకాల అంశాల్ని జోడించి తెరకెక్కించడం కలిసి వచ్చిన అంశం. ఈ నేపథ్యంలో శంబాల థాంక్స్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నిర్మాత దిల్ రాజు హాజరై, చిత్రయూనిట్ మొత్తాన్ని అభినందించారు. దిల్ రాజు మాట్లాడుతూ..ఈ సినిమా దర్శకులు యుగందర్ గారికి, ఇద్దరు నిర్మాతలు రాజశేఖర్, మహిధర్ రెడ్డి గార్లకు అదేవిధంగా ఆది సాయి కుమార్, అర్చన సహా చిత్రయూనిట్ మొత్తానికి కంగ్రాట్స్. క్రిస్మస్ కి విడుదలైన 5 సినిమాల్లో శంబాల సక్సెస్ గా నిలబడటం గ్రేట్. లాస్ట్ మంత్ నేను విదేశాల్లో ఉన్నా. విడుదలైన అన్ని సినిమాల ఫాలో అప్ చేస్తుంటే శంబాల 100 పర్సెంట్ సక్సెస్ అని విన్నా. ఈ సినిమాకు పబ్లిక్ లో మంచి టాక్ రావడం, విజయవంతంగా నిలబడటం చాలా సంతోషకర విషయం. ఈ సినిమా ఆదికి 25వ సినిమా, ఈ 25వ సినిమా విజయవంతం కావడం రియల్లీ హ్యాపీ. ఒకప్పుడు బొమ్మరిల్లు సినిమా సినీ ఇండస్ట్రీలో చాలా చేంజ్ తీసుకొచ్చింది. నిజంగా బొమ్మరిల్లు 2 తీయాలంటే మాత్రం ఆది, వాళ్ళ నాన్న సాయి కుమార్ లతో తీయాలి. కొడుకు సక్సెస్ కోసం తండ్రి పడే తపన మాటల్లో చెప్పలేం. అలా సాయి కుమార్ గారు తన కొడుకుతో పాటు శంబాల టీమ్ మొత్తానికి బ్యాక్ బోన్ గా నిలిచి సినిమా విజయంలో భాగమయ్యారు. సాయి కుమార్ ఇండస్ట్రీలోని అందరితో చాలా బాగుంటారు. ఇది టాలీవుడ్ లో ఆయన ఒక్కడికే చెల్లింది. ఈ సినిమా ప్రోమో చూసినప్పుడే చెప్పా ఇది సక్సెస్ అవుతుందని. ఇప్పుడు అదే జరిగింది. ఈ రోజుల్లో ఒక సినిమాతో ప్రేక్షకులను ఫిదా చేయడం, సక్సెస్ కావడం మామూలు విషయం కాదు. శంబాల అది చేసి చూపించింది. అందరికీ మరోసారి కంగ్రాట్స్'' అన్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200